

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL    ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి    మంగళవారం 15 ఫిబ్రవరి 2022    సంపుటి: 03    సంచిక: 162    పేజీలు: 4    వెల: రూ 3-00


## సీఎం జగన్ అధ్యక్షతన రోడ్ సేఫ్టీ కౌన్సిల్ భేటీ..



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన క్యాంప్ కార్యాలయంలో సోమవారం రహదారి భద్రతా మండలి (ఆంధ్రప్రదేశ్ రోడ్ సేఫ్టీ కౌన్సిల్) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో.. పలు కీలక అంశాలతో పాటు రోడ్డు ప్రమాదాలు జరగడానికి కారణాలు తదితర అంశాలను సీఎంకు అధికారులు వివరించారు. అనంతరం అధికారులకు కొన్ని సూచనలు చేసిన సీఎం జగన్?.. కీలక నిర్ణయాలు కొన్నింటి అమలుకు ఆమోదం సైతం తెలిపారు.ప్రమాదాలకు గురైన వారి ప్రాణాలు కాపాడటం, నిర్ణీత సమయంలో ఆస్పత్రులకు చేర్చడంలో '108' కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు సీఎం వైఎస్? జగన్?కు తెలియజేశారు. గోల్డెన్ అవర్‌లోగా వారిని ఆస్పత్రులకు చేర్చడంతో చాలామంది ప్రాణాలు నిలబడుతున్నాయన్న అధికారులు. రాష్ట్ర వ్యాప్తంగా 1190 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, అందులో 520 స్పాట్స్‌ను రెక్టిఫై చేశామని అధికారులు వివరించారు. ఆర్ అండ్ బీ నిర్వహిస్తున్న నేషనల్? హైవేల్లోనూ 78 బ్లాక్ స్పాట్స్‌ను రెక్టిఫై చేసినట్లు అధికారులు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్ సూచనలు

ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఆర్టీసీ, ప్రభుత్వం సహకారంతో కలిపి ఒక డ్రైవింగ్ స్కూలు ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్? జగన్? అధికారులకు సూచించారు. అలాగే ఈ సదుపాయాలను ఆర్టీసీ వినియోగించుకోవడంతో పాటు, డ్రైవింగ్ శిక్షణ కోసం కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. ట్రామా కేర్ సెంటర్లను కొత్త జిల్లాలకు అనుగుణంగా ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న 16 మెడికల్ కళాశాలల్లో కూడా ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అత్యాధునిక పద్ధతుల్లో ఎమర్జెన్సీ సర్వీసులు అందించాలన్న సీఎం. ప్రమాదాలకు గురైన వారు కోలుకునేందుకు వీలుగా వైజాగ్‌లో రీహాబిలిటేషన్ సెంటర్‌ను

### పలు కీలక అంశాలకు ఆమోదం

ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఇక తిరుపతి బర్డ్ ఆస్పత్రుల్లో ఉన్న సెంటర్ సదుపాయాల్ని మెరుగుపరచాలని సీఎం ఆదేశించారు.రోడ్డు ప్రమాదాలకు అధికారులు పలు కారణాలు వివరించగా.. సీఎం జగన్? పలు సూచనలు సైతం చేశారు. ప్రమాదాలను నివారించేందుకు రోడ్డుపై లేన్‌మార్కింగ్ చాలా స్పష్టంగా ఉండేలా చూడాలని, బైక్‌లకు ప్రత్యేక లేన్, ఫోర్‌వీల్ వాహనాలకు ప్రత్యేక లేన్స్ ఏర్పాటుపై ఆలోచన చేయాలని తెలిపారు. అలాగే ఎంత స్పీడులో పోవాలనే దానిపై సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్ల పక్కన ధాబాల్లో మద్యం అమ్మకాలు జరగకుండా చూస్తూ.. ప్రమాదాలు చాలావరకు తగ్గుతాయని అధికారులకు సీఎం సూచించారు. ప్రధాన రహదారులు, ముఖ్యమైన రోడ్ల పక్కన యాక్సెస్ బారియర్స్ ఉండాలని, ఈ మేరకు చర్యలు చేపట్టాలని అధికారుల్ని సీఎం జగన్? కోరారు.అలాగే డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని పునఃసమీక్షించాలన్న సీఎం వైఎస్? జగన్?.. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా సమీక్ష చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా ఏర్పాటవుతున్న కమిటీలు కూడా రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేయాలని, ఆశించిన ఫలితాలు రావాలంటే జిల్లా కమిటీలు తీసుకుంటున్న చర్యలపై కూడా అధికార గణం సమీక్ష చేయాల్సిందేనని కోరారు సీఎంరోడ్ సేఫ్టీ మీద లీడ్ ఏజెన్సీ ఏర్పాటుకు పచ్చ జెండా. పోలీసు, ట్రాన్స్‌పోర్ట్, హెల్త్ ఁ రోడ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి నిపుణులు ఇందులో ఉంటారు. ప్రమాద బాధితులకు చికిత్స కోసం క్యాష్‌లెస్ ట్రీట్ మెంట్ అందేలా నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితాలోకి ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయరోడ్డు ప్రమాద బాధితులను ఆస్పత్రులకు తీసుకొచ్చే వారిపట్ల మంచి ప్రోత్సాహం అందించాలన్న సీఎం జగన్ఐరాడ్ యాప్ వినియోగించుకుని ప్రమాదాలపై లైవ్ అప్‌డేట్ పొందేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలిపీపీపీ పద్ధతిలో రవాణాశాఖద్వారా ఆటోమేటెడ్ ఎఫ్‌సీ టెస్టింగ్ ఏర్పాటుపై కార్యాచరణ. రోడ్డు ప్రమాద బాధితులకు బీమా పరిహారం దక్కేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.ఈ సమీక్షా సమావేశంలో రహదారులు, భవనాల శాఖ మంత్రి ఎం శంకర నారాయణ, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్, లా సెక్రటరీ వి సునీత, రవాణాశాఖ కమిషనర్ పి సీతారామాంజనేయులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత అంతరిక్ష రంగంలో మరో ముందడుగు



శ్రీహరికోట,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): భారత అంతరిక్ష రంగంలో మరో అద్భుతానికి ముందడుగు పడింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన వాహననౌక పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ -సి52 విజయవంతమైంది. సోమవారం ఉదయం 5.59 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకుపోయింది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష ప్రయోగం కేంద్రం నుంచి దీన్ని చేపట్టారు. మూడు ఉపగ్రహాలతో పాటు ఈవోఎస్-04, ఐఎన్ఎస్-2టీడీ, ఇన్‌స్పైర్ శాట్-1 ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ- సీ52 రోదసిలోకి మోసుకెళ్లింది. 1,710 కిలోల ఆర్ఐ(ఈవోఎస్-04), 17.50 కిలోల ఐఎన్ఎస్-2టీడీ..8.10 కిలోల ఇన్‌స్పైర్ శాట్-1 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ వెల్లడించారు. శాస్త్రవేత్తల కృషి ఫలించిందన్నారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. భవిష్యత్తు సైన్సు, ప్రయోగాత్మక పేలోడ్స్ కోసం ఐఎన్ఎస్ 2టీడీ ఉపగ్రహం ప్రవేశపెట్టనున్నారు. వ్యవసాయం, అటవీ, నీటి వనరుల సమాచారం కోసం ఆర్ఐశాట్-1 ఉపగ్రహం ప్రవేశపెట్టనున్నారు. ఇన్ స్పైర్ శాట్ -1:వ భూమి అయానోస్పియర్ అధ్యయనం కోసం ఇన్స్పైర్ శాట్ -1 ఉపగ్రహం ప్రవేశపెట్టనున్నారు. ఎన్ఎస్-2టీడీ: భారత్, భూటాన్ సంయుక్తంగా రూపొందించిన ఉపగ్రహం. ఈ ఉపగ్రహ జీవితకాలం ఆరు నెలలు. దీని బరువు 17.5 కిలోలు 25.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం పీఎస్ఎల్‌వీ రాకెట్ ఆర్ఐశాట్-1, ఐఎన్ఎస్-2టీడీ, ఇన్‌స్పైర్‌శాట్-1 ఉపగ్రహాలను నింగిలోకి మోసుకెళ్లింది. అనంతరం 18.31 నిమిషాల తర్వాత ఈ మూడు ఉపగ్రహాలను రాకెట్ క్షక్ష్యలోకి ప్రవేశపెట్టింది. మూడు ఉపగ్రహాలు కూడా వేరు అయి నిర్ణీత కక్ష్యలోకి చేరాయి. ఈ ప్రయోగం మొత్తం నాలుగు దశల్లో పూర్తయింది. ఇస్రో చీఫ్‌గా ఇటీవల నియామకమైన సోమనాథ్ ఆధ్వర్యంలో చేపట్టిన తొలి ప్రయోగం ఇది. ఈఓఎస్ అనేది రాడార్ ఇమేజింగ్ శాటిలైట్. దీన్ని వ్యవసాయం, అటవీ సంరక్షణ, నేల తేమ, హైడ్రాలజీ, వరదల మ్యాపింగ్‌కు సంబంధించి అన్ని వాతావరణ పరిస్థితుల్లో హైక్వాలిటీ ఫొటోలను అందించేలా రూపొందించారు. ఐఎన్ఎస్-2డీ ఉపగ్రహాన్ని భవిష్యత్తు సైన్సు, ప్రయోగాత్మక పేలోడ్స్ కోసం భారత్, భూటాన్ సంయుక్తంగా రూపొందించాయి. ఇస్రో సంస్థ శ్రీహరికోట నుంచి ప్రయోగించిన పి.ఎస్.ఎల్.వి సి 52 ప్రయోగ దృశ్యం పీలేరు ప్రజలను అబ్బురపరిచింది. సోమవారం ఉదయం నెల్లూరు జిల్లా శ్రీహరికోట నుంచి ఈ ప్రయోగం జరిగింది. ఆ సమయంలో పీలేరు బస్టాండులోని ప్రయాణీకులు ఆకాశంలో రాకెట్ నింగిలోకి దూసుకెళుతున్న దృశ్యాన్ని చూసి ఆనందించారు. తమ సెల్ ఫోనుల్లో ఆ దృశ్యాన్ని చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టి హల్ చల్ చేశారు. పీఎస్ఎల్వి సి-52 మిషన్ విజయవంతం కావడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. ఈఓఎస్ - 04 ఉపగ్రహం వ్యవసాయం, అటవీ, తోటలు, నేల తేమ, హైడ్రాలజీ, వరద మ్యాపింగ్ కోసం అన్ని వాతావరణ పరిస్థితులలో అధిక రిజల్యూషన్ చిత్రాలను అందిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పీఎస్ఎల్వీ సి 52 విజయవతం అవ్వడం పట్ల సీఎం జగన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదలైంది. భూ పరిశీలనా ఉపగ్రహంతో పాటు, రెండు ఇతర ఉపగ్రహాలను విజయవంతంగా కక్షలో ప్రవేశపెట్టడం పట్ల సీఎం అభినందనలు తెలియజేశారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా అంతరిక్ష రంగంలో ఈ విజయం నిలుపుతుందన్నారు.

## జగన్‌రెడ్డి.. హోదాపై మీ యుద్ధం ఎక్కడ?: చంద్రబాబు

అమరావతి: సీఎం జగన్‌రెడ్డి.. హోదాపై మీ యుద్ధం ఎక్కడ? పలాయనవాదమెందుకు? అని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. రాజీనామాలపై నాటి మీ సవాళ్లు ఏమయ్యాయని నిలదీశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు జగన్‌రెడ్డి సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎజెండాలో ప్రత్యేక హోదా తమ ఘనతే అని చెప్పుకుని.. ఇప్పుడు తమపై బురద జల్లుతారా? అని ప్రశ్నించారు. ఏపీ ఆదాయం తగ్గకపోయినా ఆర్థికవ్యవస్థను నాశనం చేశారని దుయ్యబట్టారు. లేని సమస్యను సృష్టించి జగన్‌రెడ్డి సినీ హీరోలను అవమానించారని తప్పుబట్టారు.స్వశక్తితో ఎదిగిన మెగాస్టార్ చిరంజీవి లాంటి వారు జగన్‌ని ప్రాధేయపడాలా? అని ప్రశ్నించారు. తెలుగు సినిమా పరిశ్రమని జగన్‌రెడ్డి కించపరిచారని దుయ్యబట్టారు. విద్యార్థులకు బడులను దూరం చేయడమే నాడు నేడు పథకమా? అని ప్రశ్నించారు. కరెంట్ సరఫరా లేదు కానీ.. అధిక బిల్లులు మాత్రం వస్తున్నాయని, మోటర్లకు మీటర్ల బిగింపును ప్రభుత్వం నిలిపివేయాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.





## ప్రమాణం చేసిన ఎపి కొత్త న్యాయమూర్తులు



అమరావతి,ఫిబ్రవరి14: రాష్ట్ర హైకోర్టుకు కొత్తగా నియమితులైన ఏడుగురు న్యాయమూర్తులు ప్రమాణం చేశారు. వీరిచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సోమవారం ప్రమాణం చేయించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన న్యాయమూర్తులుగా జస్టిస్ కొనకంటి శ్రీనివాస్ రెడ్డి, జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ వెంకటేశ్వర్లు నిమ్మగడ్డ, జస్టిస్ తర్లడ రాజశేఖర్ రావు, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ రవి చీమలపాటి, జస్టిస్ వడ్డిబోయన సుజాతలచే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రమాణ స్వీకారం చేయించారు.

## ఎంపిలకు తమప్రాంత అభివృద్ధిపైచిత్తశుద్ధి లేదు

### సిఎం జగన్ వద్ద అభివృద్ధిని ప్రస్తావించే దమ్మేది
### కేంద్రం నిధులు ఇస్తున్నా కృతజ్ఞత లేని జగన్ ప్రభుత్వం
### ప్రత్యేకహోదా అంశం తొలగింపుపై దుష్ప్రచారం తగదు
### మండిపడ్డ బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు

అమరావతి,ఫిబ్రవరి14: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ ఎంపీలు తమ ప్రాంత అభివృద్ధి గురించి ఏపీ సీఎం జగన్ వద్ద ప్రస్తావించిన దాఖలాలు లేవని, ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని అసమర్థులని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తీవ్రంగా దుయ్యబట్టారు. కేంద్రం అందిస్తున్న నిధులతో చేపడుతున్న కార్యక్రమాలకు తమ ఘనతగా ఏపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. కాకినాడలో పెట్రో కెమికల్స్, గెయిల్ నిర్మాణాలకు కేంద్రం ముందుకు వస్తే రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించిందని, రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కేంద్రం ఏడు సంవత్సరాల్లో జాతీయ రహదారులకు 35వేల కోట్ల రూపాయలు ఇవ్వడంలో వైసీపీ ఎంపీల పాత్ర ఏమీ లేదని అన్నారు. ఎంత అభివృద్ధి చేసినా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపే సంస్కారం లేదని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం 75వేల కోట్లు ఏపీకి అన్ని రకాలుగా వచ్చాయని తెలిపారు. ఇందులో 25వేల కోట్లు గ్రాంట్ల రూపేణా వచ్చాయని వెల్లడించారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలపై వైసీపీ ఎంపీలు ఎలాంటి చొరవ తీసుకుని పరిష్కారించారని ప్రశ్నించారు. ఇకపోతే ఏపీకి ప్రత్యేక హోదా అంశంతో తెలంగాణకు సంబంధం లేదని బీజేపీ ఎంపీ జీవీఎల్ స్పష్టం చేశారు. సోమవా రం హోంశాఖ సెక్రటరీ అజయ్‌కు మార్ భల్లాకు జీవీఎల్ లేఖ రాశారు. ఈ నెల 17న తెలుగు రాష్ట్రాల సమావేశాన్ని లేఖలో ప్రస్తావించారు.




## నన్ను దీవించడానికి ముస్లిం సోదరీమణులు నెమ్మదిగా బయల్దేరుతున్నారు : మోదీ

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మహా ఊపుతో రాబోతోందని తొలి విడత పోలింగ్, రెండో విడత ఓటింగ్ సరళిని బట్టి స్పష్టమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కాన్పూరులో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, రాష్ట్ర సత్వర అభివృద్ధి కోసం ప్రతి కులం, వర్గం సమైక్యంగా ఓటు వేస్తున్నారన్నారు. తనను దీవించేందుకు ముస్లిం సోదరీమణులు నెమ్మదిగా ఇళ్ళ నుంచి బయల్దేరుతున్నారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం-యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మళ్ళీ మహా ఊపుతో రాబోతోందని చెప్పారు. ఎలాంటి విభజన, అయోమయం లేకుండా ప్రతి కులం, ప్రతి వర్గం ప్రజలు ఉత్తర ప్రదేశ్ సత్వర అభివృద్ధి కోసం ఓటు వేస్తున్నారన్నారు. బీజేపీ జయకేతనాన్ని మన తల్లులు, సోదరీమణులు, ఆడ బిడ్డలు తమంతట తామే ఎగురవేస్తున్నారన్నారు. "నా ముస్లిం సోదరీమణులు మోదీని ఆశీర్వదించాలని మానసికంగా సిద్ధమై, ఎలాంటి చప్పుడు లేకుండా, నెమ్మదిగా ఇంటి నుంచి బయల్దేరుతున్నారు" అని చెప్పారు. మాఫియా తిరిగి పుంజుకోవడం కోసం సమాజ్‌వాదీ పార్టీకి, అఖిలేశ్ యాదవ్‌కు మద్దతిస్తోందని ఆరోపించారు. ఉత్తర ప్రదేశ్‌లో వంశపారంపర్యంగా కుటుంబ పాలన జరిగినపుడు రేషన్ కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పేదలకు ఆహార ధాన్యాలు దక్కలేదన్నారు. లక్షలాది నకిలీ రేషన్ కార్డులను సృష్టించారన్నారు.

## మరో మారు రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ

తాడేపల్లి: మరోమారు రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం సిద్ధమైంది. 2021 నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన పంటలకు సీఎం వైఎస్ జగన్ ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ చేయనున్నారు. రేపు(మంగళవారం) తన క్యాంపు కార్యాలయం నుంచి రైతన్నల అకౌంట్లలో సీఎం జగన్ జమ చేయనున్నారు. మొత్తం 5.71 లక్షల మంది రైతన్నలకు 534.77 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఏపీ ప్రభుత్వం అందించనుంది. దీని ద్వారా 1220 రైతు గ్రూపులకు వైఎస్సార్ యంత్ర సేవాపథకం కింద 29.51 కోట్ల లబ్ధి చేకూరనుండగా, ఇన్‌పుట్ సబ్సిడీ, యంత్ర సేవా పథకం కలిపి మొత్తం 564.28 కోట్లు పంపిణీ చేయనున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన 19.93 లక్షల మంది రైతులకు 1612 కోట్ల సాయం అందించారు.



## ఆ కుట్ర వెనుక చంద్రబాబు: మంత్రి పెద్దిరెడ్డి

విజయవాడ: ప్రత్యేక హోదాను అజెండా నుంచి తొలగించడం ముమ్మాటికీ కుట్రేనని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ, ఈ కుట్ర వెనుక చంద్రబాబు ఉన్నారని నిప్పులు చెరిగారు. "అజెండాలోని 9 అంశాలను మీరే పెట్టి మీరే తీసేశారు. చంద్రబాబు నుంచి వచ్చిన ఒత్తిళ్లతోనే ఇలా చేశారు. ప్రత్యేక హోదా వద్దని అమ్ముడుపోయింది టీడీపీ నేతలే. ప్రత్యేక ప్యాకేజీ కావాలని తీసుకుంది టీడీపీనే. ఏపీ ప్రత్యేక హోదా గురించి మాట్లాడే హక్కు టీడీపీ నేతలకు లేదు. ఏపీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే సీఎం జగన్ గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశారు. ఏపీలో బీజేపీ, జనసేన నామమాత్రంగానే ఉన్నాయి. ఈ రెండు పార్టీలు లోపాయికారిగా చంద్రబాబుతో చేరతాయి. గడచిన మూడురోజులుగా జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని" మంత్రి పెద్దిరెడ్డి అన్నారు.



# సంపాదకీయం

మంగళవారం 15 ఫిబ్రవరి 2022

## జీవితాలను అతలాకుతం చేసిన కరోనా

రెండేళ్ల క్రితం ప్రపంచంలో అడుగు పెట్టిన కోవిడ్ మహమ్మారి మానవ జీవితాన్ని అతాకుతలం చేసింది. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా 25 లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. కోవిడ్ మరణాలతో కలిగే నష్టాన్ని అంచనా వేయడానికి చేపట్టిన అధ్యయనంలో విస్మయానికి గురిచేసే విషయాలు వెల్లడయ్యాయి. కోవిడ్ మహమ్మారి 25 లక్షల మందిని బలితీసుకోగా.. తత్ఫలితంగా సుమారు 2 కోట్ల ఏళ్ల జీవితకాలాన్ని ప్రపంచం నష్టపోయిందని అధ్యయనం పేర్కొంది. భారత్ సహా 81 దేశాలకు చెందిన కరోనా మరణాల సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం అంతర్జాతీయ యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలకు చెందిన పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు.అధ్యయన ఫలితాలను 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురించారు. కరోనా కారణంగా ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి సరాసరి ఆయుష్షును లెక్కించిన పరిశోధకులు.. వారి కారణంగా 2,05,07,518 సంవత్సరాల జీవితకాలాన్ని కోల్పోయినట్టు అంచనా వేశారు. వ్యక్తిగతంగా సగటున 16 ఏళ్ల జీవితకాలం కోల్పోయినట్టు పేర్కొన్నారు. సాధారణ ఫ్లూ, హృద్రోగ వ్యాధుల వల్ల కలిగే ఇయర్స్ ఆఫ్ లైఫ్ లాస్ట్ కంటే ఈ నష్టం 25 నుంచి 50 శాతం ఎక్కువని తేల్చారు. జీవిత కాలం కోల్పోయిన రేటు ఒక వ్యక్తి మరణించే వయసు, వారి ఆయుర్దాయం మధ్య వ్యత్యాసం.సీజనల్ ఫ్లూ కారణంగా కోల్పోయిన జీవితకాలం రేటు కంటే కరోనా కారణంగా 2-9 రెట్లు ఎక్కువ కోల్పోయినట్టు అధ్యయనం పేర్కొంది. మరణాల సంఖ్య పరంగానే కాదు, కోల్పోయిన జీవితాల పరంగా కూడా కోవిడ్ మరణాల ప్రభావం ఎక్కువని మా ఫలితాలు ధ్రువీకరిస్తున్నాయి అని అధ్యయనవేత్తలు పేర్కొన్నారు. జీవితకాలం కోల్పోయినవారిలో 55 నుంచి 75 ఏళ్లవారు 44.9 శాతం, 55 ఏళ్లలోపు 30.2 శాతం, 75 ఏళ్లు దాటినవారు 25 శాతం ఉన్నట్టు అధ్యయనం తెలిపింది.అధ్యయనంలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, అమెరికాలోని విస్కాన్‌సిన్-మాడిసన్ యూనివర్సిటీ, జర్మనీకి చెందిన మాక్స్‌ప్లాంక్ ఇనిస్టిట్యూట్ వంటి అంతర్జాతీయ యూనివర్సిటీల పరిశోధకులు పాల్గొన్నారు. కాగా, కరోనా మరణాలు సంభవిస్తున్న దేశాల్లో 44 శాతం పురుషుల జీవన కాలం నష్టమే ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. అధ్యయనం నిర్వహించిన 35 దేశాలలో కనీసం తొమ్మిది నెలలకు సంబంధించిన సమాచార ఉంది.మహమ్మారి పూర్తి ప్రభావాలను లేదా కనీసం దాని మొదటి వేవ్‌ను సూచిస్తుంది. ఇతర దేశాలలో ఈ గణాంకాలు మరింత పెరుగుతున్నాయి. 'ఈ ఫలితాలు కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతున్న పరిస్థితికి అర్థం పడుతున్నాయి... ఈ అధ్యయనం 2021 జనవరి 6 నాటికి కోల్పోయిన జీవితాలపై కోవిడ్ -19 ప్రభావాన్ని తెలియజేస్తుంది' అని అధ్యయనకర్తలు వ్యాఖ్యానించారు.శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా అనేక రంగాలపై కోలుకోలేని దెబ్బతీసింది. పర్యాటక రంగం, హోటల్స్ వంటి పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రభావం చూపించింది. పలురంగాల్లోని వ్యాపారస్తులు తీవ్ర నష్టాలను చవిచూశారు. కరోనా కారణంగా కదలని బస్సు.. ఇక పనిచేసే వీలులేకపోవడంతో.. ఆ బస్సు టాప్ ల మీద మొక్కలను పెంచుతున్నది ఒకరైతే.. ఒకరు తమ బస్సులు కరోనా సమయంలో నడవక పోవడంతో భారీ నష్టాల బారిన పడి ఇప్పుడు రోడ్డున పడ్డారు. ఆబస్సులను ఏమి చెయ్యాలో తెలియక తుక్కు కింద జమ చేస్తూ.. ఏకంగా కిలోల చొప్పున అమ్ముకున్నాడు. దీంతో ఆ వ్యాపారస్తుడి దయనీయ స్థితి అద్దం పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హృదయాలను కదిలించే ఈ ఘటన కేరళలో చోటు చేసుకుంది.దక్షిణాదిలో ఫేమస్ పర్యాటక ప్రాంతం కేరళ. కరోనా మహమ్మారి కారణంగా ఇక్కడ బస్సులు నడవక పర్యాటక బస్సు యజమానులు భారీగా నష్టపోయి రోడ్డున పడ్డారు. కోచి కేంద్రంగా 'రాయ్' టూరిజం పేరుతో పర్యాటక బస్సులను నడిపే రాయ్‌సన్ జోసెఫ్ వద్ద 20 బస్సులు ఉండేవి. అయితే జోసెఫ్ కూడా ఇప్పుడు కరోనా బాధితుడే. కారోనా కారణంగా విధించిన ప్రయాణ ఆంక్షలతో భారీ నష్టపోయిన జోసెఫ్ తనకున్న 20 బస్సుల్లో 10 బస్సులను అమ్మేశాడు. ఆ బస్సులను తుక్కుగా లెక్కలోకి తీసుకుని కిలో 45 రూపాయలకు కొనుగోలు చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు జోసెఫ్.కరోనా వలన విధించిన ప్రయాణ ఆంక్షలతో తీవ్రంగా నష్టపోయానని.. రాబడి తక్కువ ఖర్చులు ఎక్కువ అవడంతో దిక్కుతోచని స్థితిలో తాను తన బస్సులను అమ్మకానికి పెట్టినట్లు చెప్పాడు. ఇప్పుడు నడుస్తున్న బస్సుల రాబడి అంతంత మాత్రమే నని గత 21 రోజుల్లో కేవలం మూడు బస్సులు మాత్రమే మున్నార్ ట్రిప్ కు వెళ్లాయని.. చేసేది ఏమీ లేక ఇప్పుడు బస్సులను అమ్మకానికి పెట్టినట్టు చెప్పాడు.ఈ విషయంపై కేరళలోని బస్సు యజమానుల సంఘం కాంట్రాక్ట్ క్యారేజ్ ఆపరేటర్స్ అసోసియేషన్ (సీసీఓకే) స్పందిస్తూ.. ఈ పరిస్థితి కేవలం ఒక్క జోసఫ్ ది ఒక్కరిది మాత్రమే కాదని.. పలువురు ట్రావెల్ యజమానులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపింది. ఇప్పటికే పలు బస్సులను వడ్డీ వ్యాపారస్తులు,బ్యాంకులు జప్తు చేసుకున్నాయని.. మరిన్ని బస్సులు జప్తు చేసుకునే అవకాశం ఉందని సీఓకే చెప్పింది

# విశాఖలో ఆగని భూ కబ్జాలు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)విశాఖ అంటే అందమైన నగరం. మరో పేరు చెప్పమంటే ప్రశాంత నగరం. ఇంకా చెప్పమంటే రిటైరైన వారికి ఆనంద ప్రస్థానం. అటువంటి విశాఖలో ఒక ఇల్లు కొనుక్కుని సాఫీగా, తాపీగా బతుకు బండి లాగించేయాలని అంతా అనుకుంటారు. ఇపుడు రాజధాని పేరిట మొదలైన హడావుడి చూసి సీనియర్ సిటిజన్లు హడలిపోతూంటే విశాఖ అందాలను ప్రేమించే వారూ వణుకుతున్నారు. ఇక విశాఖల హ్యాపీగా జాబ్స్ చేసుకునే వారు కూడా ఇకపై రద్దీ జిందగీతో గుద్దులాటేనా అని అసహనపడుతున్నారు. రాజధానిగా విశాఖ మారితే రాజయోగం ఎవరికి పడుతుంది అని సగటు జనం వేస్తున్న ప్రశ్నలూ దీనికి అదనం. ఇదీ వర్తమన విశాఖ జనం మనోగతం. ఇక విశాఖలో అసలే భూముల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఇపుడు రాజధాని ప్రకటనతో ఇంకా జోరు మీదున్నాయి.మరో వైపు విశాఖలో భూములకు రెక్కలు వచ్చి ఎగిరిపోతున్నాయట. నిజానికి విభజన తరువాత విశాఖలో భూ కబ్జాలు దారుణంగా పరిగిపోయాయి. అదెంతవరకు వచ్చిందంటే ప్రజా ప్రతినిధుల ఖాళీ జాగాలను కూడా నమిలి మింగేసేటంతగా భూముల దందా సాగిపోయింది. ఇలా వేలల్లో భూములు కబ్జా గద్దలు ఆక్రమించేశాయి. దాని మీద చంద్రబాబు సర్కార్ సిట్ విచారణ జరిపించినా కూడా అసలు దోషులు బయటపడలేదు. అలా నివేదికను సైడ్ చేసేశారు. ఇపుడు ఏకంగా రాజధానే రావడంతో కబ్జా కోరుల కళ్ళల్లో మరో మారు ఆనందం కనిపిస్తోందట.విశాఖ భూముల మీద కబ్జా కోరుల కన్ను పడింది. ఇక్కడివారే కాదు, ఇతర ప్రాంతాల నుంచి కూడా లుంగీ బ్యాచులు దిగిపోతున్నాయని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఈ భూ కబ్జాల లీలలు ఏ రేంజిలో ఉన్నాయంటే ఏకంగా విశాఖ వచ్చిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి నా పేరు మీద ఎవరైనా భూముల దందా చేస్తే కఠిన చర్యలు తీసుకోండంటూ మీడియాముఖంగానే అధికారులకు విన్నవించుకున్నారు. ఇతర జిల్లాల నుంచి అంగబలం, అర్థబలం కలిగిన ఆసాములు రాత్రికి రాత్రి దిగిపోయి భూములను పరుపుని చుట్టినట్లుగా

చుట్టేస్తున్నారని టాక్. పత్రం, కాగితం లేకుండానే దర్జాగా కబ్జా చేస్తున్నారని ప్రచారం సాగుతోంది.ఇదిలా ఉండగా భూకబ్జా కేసులు ఎన్నడూ లేని విధంగా గత కొన్ని నెలల్లో పెరిగిపోవడంతో విశాఖ వాసులు ఆందోళన పడుతున్నారు. నిజానికి విశాఖలో నివాసం ఉన్న వారు కాకుండా ఇక్కడ ఉద్యోగాలకు వచ్చిన వారు కూడా తమకు ఒక స్థలం ఉండాలని కొనుక్కుని ఖాళీగా ఉంచుకున్నవి కూడా కబ్జాకోర్లు చప్పరించేస్తున్నారు. ఇక ఎక్కడో విదేశాలో ఉంటూ కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో ఇక్కడ భూములు కొనుక్కున్న వారు సైతం తాజా పరిణామాలతో బెంబేలెత్తుతున్నారు. తమ భూములను కాకుండా చేస్తారా అని ఆందోళనపడుతున్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ అని కాదు ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ పాగా వేస్తే కబ్జా బ్యాచులకు అధికారుల, రాజకీయ పెద్దల అండదండలు ఉండడంతో విశాఖలో భూములనీ హాంఫట్ అయిపోతున్నాయని అంటున్నారు. ఇపుడే ప్రభుత్వ పెద్దలు మేలుకుని భూదందాల మీద ఉక్కుపాదం మోపకపోతే మరో అమరావతి కథగా విశాఖ కూడా మారుతుందని నగరవాసులు అంటున్నారు.

# 2024 కోసమే ఎత్తులా...

విజయవాడ, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు ఎటుగా పడుతున్నాయి? ముఖ్యమంత్రి అలోచనలు ఎటుగా సాగుతున్నాయి? తెలుగు వారి కొత్త సంవత్సరం, ఉగాది నుంచి, కొత్త బాటలో సాగాలని ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారా, అలాగే మద్యంలాగానే, రియల్ దందాను సర్కార్ పరం చేయాలని ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారా అంటే, కొంచెం అటూ ఇటుగా అలాంటి ఆలోచనలే జరుగుతున్నాయని, అంటున్నారు.రానునన్ రెండేళ్ళు భూ దందానే ప్రభుత్వ ప్రధాన వ్యాపకంగా ఉంటుంది అంటున్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఉగాదికి ముందే కొత్త జిల్లాల ఏర్పాటు జరిగిపోవాలని, తెలుగు సవత్సరం తొలిరోజు నుంచే కొత్త జిల్లాల నుంచి పాలన ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. అయితే కనీస మౌలిక సదుపాయాలు, అధికారులు, సిబ్బంది పపంకాలు ఏమీ కాకుండానే రెండు నెలల వ్యవధిలో 'కొత్త' ఆలోచనలు ముడి పడతాయా లేదా అనేది అనుమానమే అయినా,అసలు ఈ ఆలోచన వెనక ఉన్న రహస్యం ఏమిటనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినవస్తోంది. నిజానికి, కొత్త జిల్లాలు, కొత్త పరిపాలన కంటే, కొత్త రాజధానే ముఖ్యమంత్రి మనసులోని ఆలోచన అని, అందుకే ఆయన ఆరు నూరైనా, నూరే ఆరైనా ఉగాది నుంచి కొత్త జిల్లాలు కొలువు తీరాలని వెంట పడుతున్నారని, అధికారులు అంటున్నారు. 'చిత్తం శివుని పైన, భక్తి చెప్పుల పైన' అన్నట్లుగా ముఖ్యముఖ్య మంత్రి జగన్ రెడ్డి ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు. కొత్త జిల్లాల ఏర్పటు వలన ఇతర ప్రయోజనాల మాట ఎలా ఉన్నా, భూముల ధరలకు రెక్కలొస్తాయి. రెండు రోజుల క్రితం తెలంగాణ ముఖ్యమంత్రి కేసేఆర్ జనగామా జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా, జనగామ జిల్లా ఏర్పాటు వలన కరవు జిల్లాలోనూ భూముల ధరలకు రెక్కలొచ్చాయని, మూడు ఎకరాలున్న రైతు కూడా కోటీశ్వరుడు అయ్యాడని పేర్కొన్నారు. అదే విధంగా ఏపీలోను కొత్త జిల్లాల ఏర్పాటుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రెక్కలొస్తాయి. అందుకోసమే ముఖ్యమంత్రి ఆ దిశగా అడుగులు వేస్తున్నారని అంటున్నారు.అదలా ఉంటే, ఉగాదికి కొత్త జిల్లాలే కాదు, కొత్త పరిపాలనా రాజదాని 'విశాఖ' నుంచి పరిపాలన ప్రారంభిస్తారని కూడా అంటున్నారు. అదే రోజు నుంచి పాలన విశాఖ నుంచి ప్రారంభమవుతుందని అంటున్నారు. ఇటీవల ఎంపిక చేసిన సినిమా పెద్దలతో జరిపిన చర్చల్లో కూడా ముఖ్యమంత్రి విశాఖ 'రియల్' ప్రస్తఃవన చేశారు.అంటే, ముఖ్యమంత్రి విశాఖ కేంద్రంగా పని చేసేందుకు, మెల్లి మెల్లిగా ఒక్కొక కార్యాలయాన్ని అక్కడికి తరలించేందుకు సిద్దమై పోయారని తెలుస్తోంది. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా చేసి కార్యాలయాలను తరలిస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు పలుసార్లు ప్రకటించారు. ఇందులో భాగంగానే, ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయాలని తాజాగా నిర్ణయం జరిగిందని అంటున్నారు. ఏయూలోని 'విద్యాభవనం'లో ఈ కార్యాలయాన్ని ఏర్పాటుచేయొచ్చని విశాఖ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.మరో వంక ఇతర కర్యాలయాల కోసం ప్రైవేటు భవనాలను లీజుకు తీసుకనే పనులు కూడా మొదలయ్యాయి. ఇందుకోసం తొట్లకొండపై గ్రేహౌండ్స్ కార్యాలయం, కొన్ని ప్రైవేటు ప్రాంగణాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే, దాదాపు 200 ఎకరాల్లో కాపులుప్పాడలోని కొండపై అభివృద్ధి ఐటీ లేఅవుట్ రెండున్నరేళ్లుగా ఖాళీగానే ఉంచారు. పిఠాపురం కాలనీలో వీఎంఆర్‌డీఏ నిర్మించిన ఐదు అంతస్తుల భవనం కూడా కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. గంభీరం వద్ద మూసేసిన ఓ ప్రైవేటు కళాశాలలో, మధురవాడ ఐటీ హిల్స్‌లో పలు భవనాలు ఖాళీగా ఉన్నాయి. దాదాపు 10 అంతస్తుల్లోని మిలీనియం టవర్స్‌లో టవర్-బి నిర్మాణం చాలావరకు పూర్తయింది. వీటిలో కార్యాలయాలకు ఏవి ఉపయోగపడతాయో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.అలాగే, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం కూడా ఎక్కడో అక్కడ సిద్ధం చేసి ఉంటారని భావిస్తున్నారు. అదలా ఉంటే, ఉగాది రోజున లేదా అంతకంటే ముందుగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కూడా ఉంటుందని అంటున్నారు. ఉగాదికి కొత్త ఆలోచనలు చేయడం మంచిదే, కానీ, రాష్ట్రాన్ని అమ్మకానికి పెట్టే ఆలోచన ఉగాది రోజు చేస్తునారా,అనేది అనుమానం.

# అమరావతి ఆందోళనలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

గుంటూరు, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)తెలుగు సినీ పరిశ్రమను సీఎం జగన్ విశాఖకు ఆహ్వానించినప్పుడు అమరావతి గుర్తుకు రాలేదా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సినిమా టికెట్ల కోసం సమయం కేటాయించిన సీఎం జగన్ రెడ్డి అమరావతి రైతుల కోసం ఎందుకు కేటాయించరంటూ ప్రశ్నలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో సర్వ నాశానం అయిపోయిన రోడ్ల గురించి, యూరియా అందుబాటులో లేక రోడ్డెక్కిన అన్నదాతల కోసం ఎందుకు సమయం కేటాయించరని నిలదీస్తున్నారు. సమస్యలను సృష్టించడమే కాకుండా వాటిని మరింతగా జఠిలం చేసి, చివరికి బాధిత వర్గాలు తనను బతిమాలుకునేలా చేసుకోవడం జగన్మోహన్ రెడ్డికి అలవాటైపోయిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సినీ పరిశ్రమ పెద్దల చేత కూడా బతిమాలించుకుని, చేయెత్తి దండం పెట్టించుకుని మరీ తన ఈగోను సంతృప్తి పరుచుకునే జగన్ ధోరణిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినిమా పెద్దల పరిస్థితే ఇలా ఉంటే ఇక ఏపీలో సామాన్యుడికి దిక్కెవరనే ప్రశ్నలు వస్తున్నాయి.అడ్డగోలు విభజనతో అన్ని విధాలా నష్టపోయిన ఏపీకి రాజధాని నిర్మాణం కోసం చంద్రబాబు హయాంలో అమరావతి ప్రాంత రైతులు వేలాది ఎకరాల భూమిని త్యాగం చేసిన విషయం తెలిసిందే. రాజధాని అమరావతి నగర నిర్మాణం వేగంగ జరుగుతున్న సమయంలోనే తెలుగుదేశం పార్టీకి ఓటమి అంటగట్టి, ఒక్క చాన్స్ అంటూ అందరినీ కాళ్లా వేళ్లాపడి వేడుకున్న జగన్ రెడ్డికి జనం పట్టం కట్టారు. అమరావతి రాజధాని నిర్మాణం పూర్తయితే.. ఆ క్రెడిట్ చంద్రబాబుకే వెళ్లిపోతుందనే దురాలోచనతో దాన్ని పక్కన పెట్టేశారు జగన్. ఆపై మూడు రాజధానులను తెరపైకి తెచ్చారు. దరిమిలా జరిగిందేమిటంటే.. రాష్ట్రం విడిపోయి ఏడేళ్లు దాటినా రాజధాని ఏదో తెలియని అనిశ్చితిలోనే కొట్టుమిట్టాడుతోంది. ఇదే జగన్ లోని కపట మనస్తత్వానికి అద్దం పడుతోందంటున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు అమరావతినే రాజధానిగా ఉంచాలంటూ ఆ ప్రాంత రైతులు రెండేళ్ళకు పైగా నిరంతరాయంగా, అవిశ్రాంతంగా ఉద్యమిస్తున్నా జగన్ పట్టించుకున్న పాపాన పోలేదు. ఉద్యమిస్తున్న రైతులతో ఒక్కసారి కూడా చర్చించి, సమస్య పరిష్కారం కోసం ఏమాత్రం ప్రయత్నం చేయలేదు.

పైగా ఉద్యమిస్తున్నా అమరావతి రైతులను పెయిడ్ ఆర్టిస్టులంటూ అవమానించారు. అనేక మంది రైతులను అరెస్టులు చేయించారు. అడుగడుగునా ఉద్యమాన్ని అణచివేసేందుకు జగన్ రెడ్డి సర్కార్ చేయని ప్రయత్నం లేదు. సభ పెట్టుకోనివ్వలేదు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయనివ్వకుండా అడ్డుకున్నారు. చివరాఖరికి జగన్ తన తాడేపల్లి ప్యాలెస్ నుంచి సచివాలయానికి, అసెంబ్లీకి సెక్యూరిటీ లేకుండా వెళ్లే ధైర్యం కూడా లేదు.మూడు రాజధానుల బిల్లును కోర్టు మొట్టికాయలు వేయడంతో ఉపసంహరించుకున్న జగన్.. మరింత పకడ్బందీగా మరో బిల్లు తెస్తామని చెప్పడం ఆయనలోని జగమొండి తనానికి నిదర్శనం అంటున్నారు. సినిమా టికెట్ల వ్యవహారంపై సినీ పెద్దలతో ఆగమేఘాల మీద చర్చించడం, సమస్య పరిష్కారం కోసం కమిటి వేయడం లాంటి చర్యలు చేపట్టిన జగన్ అమరావతి రైతుల ఆందోళనపై ఎందుకు స్పందించరంటూ నిలదీస్తున్నారు

# విశాఖలో భూ పన్నారాలు...?

విశాఖపట్టణం, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మంచి అడ్మినిస్ట్రేటర్ కాక పోవచ్చును, కానీ, మంచి వ్యాపారవేత్త. ఇది, ఆయన రాజకీయ ప్రత్యర్థులు సైతం ఆమోదించి తీరవలసిన వాస్తవం. అదే విహాయాన్ని ఆయన మరో సారి నిరుపించుకున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్'లో ప్రత్యక్షంగా అధికారంలో లేకుండానే, ఆయన తమ వ్యాపార దక్షతను చూపారు. వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి రుజువు చేశారు. 'క్విట్ ప్రో కో' తో కుప్పలు కుప్పలుగ డబ్బులు సంపదించారు. సరే ఆ తర్వాత, ఆయన అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు రావడం,అయన ఓ 16 నెలలు జైలులో ఉండి రావడం అదంతా చరిత్ర. అలాగే, కొన్నికేసులకు సంబంధించి కోట్ల రూపాయల ఆస్తులను ఈడీ జప్తు చేసిందనుకోండి,అది కూడా వేరే విషయం అనుకోండి. అయితే, ఇప్పటికీ, ఆయన సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఓ పదివరకు చార్జి షీట్లలో ఏ1 ముద్దాయిగా ఉన్నారు. ఆదలా ఉంటే, ఇప్పుడు జగన్ రెడ్డి బిజినెస్ యాంగిల్'లో అలోచించి సినిమా ఇండస్ట్రీతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు పథకాలను సిద్ధంచేస్తున్నట్లు రాజకీయ,పరిశ్రమ వర్గాల్లో అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. సినిమా టికెట్ల రేట్ల తగ్గింపు ఎక్కిపు లెక్కలతో మొదలైన సర్కార్, సినీ పరిశ్రమ వర్గాల చర్చలు, చివరకు భూదందాకు చేరాయి. సినిమా పరిశ్రమ, 'సమస్యలు' చర్చించేందుకు, మెగా స్టార్ చిరంజీవి బృందంతో జరిపిన చర్చల్లో ముఖ్యమంత్రి, హీరోలకు 'ల్యాండ్ బిస్కెట్స్' ఆఫర్ చేశారు. 'వైజాగ్ వచ్చేయండి, ఇల్లు కట్టుకునేందుకు, స్టూడియోలు పెట్టుకునేందుకు భూములిస్తాను' అంటూ ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. అటు నుంచి వచ్చిన రియాక్షన్ ఏమిటో కానీ, ఇంతలోనే, ప్రభుత్వం చకచక పావులు కదపడం మొదలు పెట్టింది. ముఖ్యమంత్రి నోటి నుంచి సినిమా పరిశ్రమకు భూములు ఇస్తామనే మాట వచ్చిన రెండు రోజుల్లోనే, అదికార యంత్రాంగం భూసేకరణకు సిద్దమై పోయింది. ముఖ్యమత్రి ఒక్క విశాఖపట్నం అంటే, అధికారులు విశాఖతో పాటు తిరుపతి, రాజమహేంద్రవరంలోనూ స్టూడియోలకు భూసేకరణ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వ అధికారులు భూములను గుర్తించాలని కింది స్థాయి అధికారులకు ఆదేశాలు కూడా ఇచ్చేసినట్లు, క్రింది స్థాయి అధికార వర్గాల సమాచారం.

## కొత్త జిల్లాల ఆధారంగానే.. విస్తరణ

విజయవాడ, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో మంత్రి వర్గ విస్తరణ ఎప్పుడెప్పుడా? అని ఎదురు చూస్తున్నారు. అసలు జగన్ మంత్రి వర్గ విస్తరణ చేస్తారా? లేదా? అన్న అనుమానం కూడా పార్టీ నేతలకు కలుగుతుంది. అయితే తాజాగా ఇందుకు సంబంధించి సంకేతాలను జగన్ ఇచ్చినట్లు తెలిసింది. మూడేళ్లు పూర్తయిన తర్వాత జగన్ మంత్రి వర్గ విస్తరణ చేపట్టనున్నారు. అంటే జూన్ నెలలో మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశాలున్నాయి. నిజానికి జగన్ రెండున్నరేళ్లకే మంత్రివర్గాన్ని విస్తరిస్తానని చెప్పారు. కానీ కరోనా కారణంగా దాదాపు ఏడాది పాటు ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. దీంతో జగన్ మంత్రివర్గాన్ని మూడేళ్లకు విస్తరించాలని భావించారు. జూన్ నెలతో జగన్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతుంది. అప్పుడే మంత్రి వర్గాన్ని విస్తరించాలని జగన్ నిర్ణయించారట. మరో మూడున్నర నెలలు మాత్రమే సమయం ఉండటంతో దీనిపై కసరత్తు ప్రారంభమయినట్లు తెలిసింది. కొందరికే మినహాయింపు.90 శాతం మంత్రివర్గంలో సభ్యులను జగన్ మార్చేవిధంగా ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. సీనియర్ మంత్రులకు ఒకరిద్దరకు మాత్రమే మినహాయింపు ఉంటుందని, మిగిలిన వారు పార్టీ కోసం పనిచేయాలని కూడా సూచించనున్నారు. అయితే ఉగాది నాటికే కొత్త జిల్లాలు ఏర్పడుతుండటంతో ఆ ప్రాతిపదికనే మంత్రివర్గ విస్తరణ చేయాలన్నది జగన్ ఆలోచనగా ఉంది. ఇటీవలే కొత్తగా 13 జిల్లాలను ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ ప్రాతిపదికనే.... ఉగాది నాటికి కొత్త జిల్లాలు ఏర్పాటు కాబోతున్నాయి. అయితే కొత్త జిల్లాల ప్రాతిపదికన మంత్రివర్గంలోకి సభ్యులను తీసుకోవాలని జగన్ భావిస్తున్నారు. సామాజికవర్గాల సమీకరణలతో పాటు కొత్త జిల్లాలు కూడా ఈసారి మంత్రివర్గ విస్తరణలో ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. జూన్ 8వ తేదీతో మంత్రివర్గం ఏర్పాటై మూడేళ్లు అవుతుంది. అప్పుడే మంత్రివర్గ విస్తరణను జగన్ చేపట్టనున్నారని తెలిసింది.

## టీడీపికి కలిసి రాని వ్యూహకర్తలు

విజయవాడ, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కొన్ని నియోజకవర్గాలకు ఇన్ ఛార్జిలను నియమించలేదు. కారణం ఇక్కడ యువకులను నియమించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. ఆర్థిక, సామాజికపరంగా బేరీజు వేసుకుని చంద్రబాబు ఇన్ ఛార్జిలను నియమిస్తారంటున్నారు. ఇప్పటికీ దాదాపు ముఫ్ఫయి నుంచి నలభై నియోజకవర్గాల్లో టీడీపీకి ఇన్ ఛార్జులు లేరు. నియోజకవర్గాల వారీగా చంద్రబాబు సమీక్షలు చేసన్తా ఇన్ ఛార్జిలపై నిర్ణయం తీసుకుంటున్నారుముఖ్యమైన నియోజకవర్గాల్లో యువకులకు ఇన్ ఛార్జి పదవులను ఇవ్వాలని చంద్రబాబు యోచిస్తున్నారు. యువకులయితేనే ఈ రెండేళ్ల పాటు పార్టీని నియోజకవర్గాల్లో ధైర్యంగా నడపగలరని నమ్ముతున్నారు. సీనియర్ నేతలను పక్కన పెట్టి మరీ ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. త్యాగాలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే చంద్రబాబు సీనియర్ నేతలకు సంకేతాలను ఇచ్చారు. అనేక నియోజకవర్గాల్లో చంద్రబాబు సర్వేలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా సర్వే.... గత ముఫ్ఫయి నెలలుగా పార్టీని పట్టించుకోనిది ఎవరు? నియోజకవర్గంలోని క్యాడర్ కు దూరంగా ఉన్నదెవరు? అక్కడ మరో బలమైన నేత ఎవరు? అన్న అంశాలతో ప్రత్యేకంగా చంద్రబాబు సర్వే చేయిస్తున్నారు. రాబిన్ శర్మ నేతృత్వంలో రాష్ట్రంలో అనేక బృందాలుగా విడిపోయి ఈ సర్వే నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. సర్వే లో ఎవరి పేర్లు ఖరారయితే వారికే చంద్రబాబు ఇన్ ఛార్జి పదవులు ఇస్తారని మొన్నటి వరకూ చెప్పారు. అయితే రాబిన్ శర్మ టీం పై నమ్మకం కుదరని చంద్రబాబు మరో డీల్ కుదుర్చుకున్నారని తెలిసింది. ప్రశాంత్ కిషోర్ టీంలో ఉన్న సునీల్ తో చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారంటున్నారు. ప్రస్తుతం ఇన్ ఛార్జిలుగా ఉన్న వారిని కూడా కొన్ని చోట్ల మార్చాలని చంద్రబాబు నిర్ణయించినట్లు చెబుతున్నారు. వారు ఉన్నా పార్టీకి ఉపయోగం లేదని భావించిన చంద్రబాబు వారి స్థానంలో కొత్తనేతలకు స్థానం కల్పించాలని యోచిస్తున్నారు. అదే జరిగితే కొందరు నేతలు ఇన్ ఛార్జి పదవులను కోల్పోయే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సారి చంద్రబాబు కఠినంగా ఉండాలనే భావిస్తున్నారు. రానున్న రెండేళ్లు కీలకం కావడంతో రాజీ పడే ప్రసక్తి ఉండకుండా యువకులకు ఎక్కువగా అవకాశమివ్వాలన్నది చంద్రబాబు యోచనగా ఉంది. మరి కొత్త వ్యూహకర్త ఎవరి జాతకం ఎలా రాస్తారో అన్నది పార్టీ నేతల్లో టెన్షన్ గా మారింది.

## మళ్లీ తెరపైకి హోదా...

విజయవాడ, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)ఒక విషయం మాత్రం స్పష్టమయింది. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా అంశం ఇంకా యాక్టివ్ గానే ఉందని భావించాలి. కేంద్ర హోంశాఖతో ఈ విషయానికి సంబంధం ఉన్నా ఇది పూర్తిగా రాజకీయ అంశంగానే చూడాలి. రాజకీయ నిర్ణయంతోనే ప్రత్యేక హోదా సాధ్యమవుతుంది. అయితే ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో మార్చి నెలాఖరుకు ఒక స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత? బీహార్ ఇప్పటికే తమకు ప్రత్యేక హోదా కావాలని కోరుతుంది. బీహార్ కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన పరిస్థితులు అధికారంలో ఉన్న బీజేపీకి ఉన్నాయి. బీహార్ తో పాటు ఏపీకి కూడా ప్రత్యేక హోదాను ఇచ్చే అంశం బీజేపీ పెద్దల పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. దీనికి రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి. గతంలో మాదిరి బీజేపీ పరిస్థితి లేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత బీజేపీ భవిష్యత్ పై కొంత అవగాహన వస్తుంది. వచ్చే లోక్ సభ ఎన్నికలకు ముందే అలయన్స్ ను దక్షిణాది రాష్ట్రాల్లో పెట్టుకోవాలని బీజేపీ భావిస్తుంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ప్రీపోల్ అలయన్స్ పై బీజేపీ నేతలు దృష్టి పెడతారు. అప్పుడు ఆంధ్రప్రదేశ్ లో ప్రీ పోల్ అలయన్స్ బీజేపీకి అవసరమవుతుందని రాజకీయ విశ్లేషకులు సయితం అంచనా వేస్తున్నారు. 2024 ఎన్నికల్లో గతంలో మాదిరి వన్ సైడ్ ఫలితాలు రావు. బీజేపీ? మరోసారి అధికారంలోకి వచ్చిన పూర్తి స్థాయి మెజారిటీ వచ్చే అవకాశం లేదంటున్నారు. అలా అయితేనే? అందుకే ఏపీలో ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకోవాలన్నది బీజేపీ పెద్దల ఆలోచనగా ఉంది. అయితే ప్రత్యేక హోదా ఇస్తే ఎవరికైనా తాము మద్దతిస్తామని ఏపీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే జగన్ ప్రీ పోల్ అలయన్స్ కు హోదా ఇస్తేనే అంగీకరిస్తారు. అందుకే మార్చి నెలాఖరు నాటికి ప్రత్యేక హోదాపై కేంద్రం నుంచి ఒక స్పష్టత వచ్చే అవకాశముందని ఢిల్లీలో జోరుగా చర్చ జరుగుతుంది.

# ఇవాల్టి నుంచి స్వామి భక్తులకు గుడ్ న్యూస్

తిరుమల ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలనుకునే భక్తులకు శుభవార్త. కరోనా కారణంగా నిలిపివేసిన ఆఫ్‌లైన్ సర్వదర్శనం టికెట్లను పునరిద్ధరించాలని టీటీడీ నిర్ణయించింది. ఫిబ్రవరి 15 నుంచి ఈ టికెట్లను భక్తులకు అందుబాటులోకి తీసుకురానుంది. 16వ తేదీ దర్శనం కోసం 15న ఉదయం 9 గంటలకు టీటీడీ టోకెన్లు జారీ చేయనుంది. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం కాంప్లెక్స్, శ్రీ గోవింద రాజ స్వామి సత్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఈ సర్వదర్శనం టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. నిత్యం 15 వేల సర్వదర్శనం టోకెన్లు జారీ చెయ్యాలని టీటీడీ ఏర్పాట్లు చేసింది . కరోనా కారణంగా 2020 మార్చి తర్వాత ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టోకెన్ల జారీని టీటీడీ నిలిపేసింది. ప్రస్తుతం కరోనా కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతుండడంతో భక్తులకు సర్వదర్శనం టోకెన్లు ఇచ్చేందుకు టీటీడీ సమాయత్తమైంది. కాగా రెండేళ్ల తర్వాత మొదటిసారిగా అత్యధిక సంఖ్యలో సర్వదర్శనం టోకెన్లను టీటీడీ విడుదల చేస్తోంది.గత ఏడాది రోజుకు 2వేల చొప్పున ఆఫ్‌లైన్ సర్వదర్శనం టికెట్లు జారీ చేసినా.. కొవిడ్‌కు తోడు భక్తుల రద్దీ దృష్ట్యా టీటీడీ వాటిని నిలిపేసింది. ప్రస్తుతం ఆన్ లైన్ లో మాత్రమే రోజుకు 5వేల చొప్పున శ్రీవారి సర్వదర్శనం టోకెన్లను ప్రతి నెల విడుదల చేస్తోంది.ప్రస్తుతం టీటీడీ ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 టికెట్లు), వర్చువల్ సేవా, వీఐపీ సిఫార్సులు, ఆన్ లైన్ సర్వదర్శనం టోకెన్లు ఉన్నవారికి మాత్రమే శ్రీవారి దర్శనం కల్పిస్తున్నారు. దీంతో ప్రతిరోజు 25-30 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. ఇప్పుడు ఆఫ్‌లైన్‌లో రోజు15 వేల టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ సిద్ధమైంది. దీంతో నిత్యం శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య 40 వేలు దాటి పోయే అవకాశం ఉంది. 16వ తేదీన శ్రీవారిని దర్శించుకోవాలి అనుకునే వారు.. ఒకరోజు ముందుగానే టోకెన్లు తీసుకోవాల్సి ఉంటుంది

# 22పనులన్నీ చకచకా.. ఉగాది నుంచే ప్రారంభం

**ముమ్మరంగా సాగుతున్న నూతన జిల్లాల ఏర్పాట్ల ప్రక్రియ**

**ఉగాదికి తొలుత తాత్కాలిక కార్యాలయాల నుంచి పరిపాలన**

గుంటూరు నూతన జిల్లాల ఏర్పాటు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఏప్రిల్ 2వతేదీ నుంచి కొత్త జిల్లాలు కేంద్రంగా పరిపాలన ప్రారంభించేందుకు చకచకా పనులు జరుగుతున్నాయి. తొలుత తాత్కాలిక కార్యాలయాల నుంచి పాలనా కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన భవనాలు, ఖాళీ స్థలాలు, ప్రైవేట్ భవనాల కోసం ఆర్‌అండ్బీ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని సబ్ కమిటీ ఇప్పటికే పూర్తి సమాచారాన్ని సేకరించింది. కొత్త జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోని స్థిరాస్తుల సమాచారంతో ఒక నివేదిక రూపొందించింది. ఈ వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపి పరిశీలించాలని సూచించింది. దీన్ని బట్టి కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, ఇతర జిల్లా కార్యాలయాలను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

# వాచ్ మెన్ పై కత్తి తో దాడి

నూజివీడు కృష్ణాజిల్లా నూజివీడులో దారుణం జరిగింది. అపార్ట్మెంట్ వాచ్మెన్?పై ఫ్లాట్ యజమాని కత్తితో దాడి చేసాడు. నిందితుడు ఫ్లాట్ యాజమాని రిటైర్డ్ వైద్యుడుగా పోలీసులు వెల్లడించారు. వైద్యుడు మద్యం మత్తులో వాచ్మెన్తో వాగ్వివాదానికి దిగాడు. ఇరువురి మధ్య వాదన పెరగడంతో చాకుతో వాచ్మెన్ మొహంపై తీవ్రంగా గాయపరచాడు. అడ్డుకోబోయిన మరో వ్యక్తిపై దాడి చేసిని రిటైర్డ్ డాక్టర్ పరారీలో వున్నాడు. పోలీసులు తీవ్రంగా గాయపడ్డ ఇరువురిని ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రహదారులకు మహర్దశ

**ఎమ్మెల్యే వాసుపల్లి**

విశాఖపట్నం రాష్ట్రంలో 51 కొత్త రోడ్లకు మహర్దశ పట్టిందని విశాఖ సౌత్ ఎమ్మె ల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నా రు.దెబ్బతిన్న రోడ్లు గత ప్రభుత్వ పని తీరుకు నిదర్శనాలని,దేశంలోనే నెంబ ర్ వన్ గా ఏపీ నీ తీసుకు వెళ్ళే యత్నంలో జగన్ మోహన్ రెడ్డి పాలన సాగుతోందని చెప్పారు.రాష్ట్ర జీఎస్టీ తగ్గించి రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం జగన్మోహన్ రెడ్డి కేంద్రాన్ని కోరా రని,నితిన్ గడ్కరీ సీఎం కోరిన 35 వేల కోట్ల లో 22 వేల కోట్లు మంజూ రయ్యా యని,అందులో 11 వేల కోట్లు ఇప్పటి కే పనులు మేదలయ్యాయని అన్నా రు.విభజన హామిల్లో ఒకటైన విశాఖ భోగాపురం రోడ్డు కూడా త్వరలోనే మొదలవుతుందని నమ్మకం వుందని, రవాణా వ్యవస్థ మెరుగు పరిచేలా పోర్టులు,హై వే నిర్మాణం కి ఏపీ ప్రభు త్వం ఏర్పాటు చేసిందని అన్నారు.రోడ్ల మరమత్తుకు ఆరు వేల కోట్లు సీఎం జగన్మోహన్ రెడ్డి టెండర్లు పిలిపించా రని,రాయలసీమ జిల్లాల్లో రోడ్ల మర మ్మత్తు తో పొరుగు రాష్ట్రాల తో రవాణా మెరుగుపడిందని అన్నారు.

## నందిగామలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నందిగామ నందిగామ పట్టణంలో రూ.3.16 కోట్ల తో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శంకుస్థాపన చేసారు. పలు వార్డుల్లో సిసి డ్రైనేజ్ లు- సి సి రోడ్డులు - వాటర్ పైప్ లైన్ ల నిర్మాణ పనులకు రూ.4.1 కోట్లతో 28 వర్కు లకు ప్రణాళిక రూపొందించార. ఎమ్మెల్యే మాట్లాడుతూ విమర్శకులకు అభివృద్ధితోనే సమాధానం చెప్తాం. నందిగామ ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. గత పాలకులు అవినీతే లక్ష్యంగా పరిపాలన చేశారని , మేము అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నామని తెలిపారు.నందిగామ పట్టణాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నందనవనంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాలు తట్టుకోలేక తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం అర్థం లేని అంశాలతో రాజకీయాలు చేస్తున్నారని , ఎవరెన్ని కుట్రలు చేసినా -నందిగామను అభివృద్ధి చేసి చూపిస్తానని , విమర్శకులకు అభివృద్ధితోనే సమాధానం చెబుతామని ఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహన్ రావు తెలిపారు , నందిగామ ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు ,ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ మండవ వరలక్ష్మి, కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నం -ఓర్సు లక్ష్మి , నగర పంచాయతీ కౌన్సిల్ మరియు కో ఆప్షన్ సభ్యులు , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు ..

# విర్లు ఉన్నచోట.... పీర్లు ఉండవు....

పగిడ్యాల ఫిబ్రవరి 14 పీర్ల స్వామి దేవుడు ఉన్నచోట పీర్ల పండుగ జరిగేది కాదని గతంలో పెద్దలు చెప్పేవారని పండుగ అయ్యపు రెడ్డి చెప్పుకొచ్చారు. నెహ్రూ నగర్ గ్రామం లోని వీరాపురం గ్రామస్తులు విర్ల స్వామి అక్క గంగమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆదివారం ఉదయం నుండి విర్ల స్వామి దేవాలయ ఆవరణం భక్త జన సందోహంతో కిక్కిరిసి పోయింది. పురోహితులు గ్రామ కమిటీ సభ్యుల సమక్షంలో కొత్తగా ఏర్పాటు చేసినటువంటి వీర్ల స్వామి. గంగమ్మ విగ్రహ ప్రతిష్ట ఏర్పాటు చేసిన అనంతరం కులమతాలకతీతంగా వీరాపురం గ్రామస్తులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ అయ్యాపు రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం. నాగర్ కర్నూల్ జిల్లా. కొల్లాపూర్ సమీపంలోని మొల చింతలపల్లి గ్రామ ఆడబిడ్డ ద్వారా వీర్లస్వామి సప్త నదుల సంగమేశ్వరం సమీపంలోని పాత వీరాపురం గ్రామానికి చేరుకొని ఒకవేప మేద్దులో లీలా రూపంలో ప్రత్యక్షమై దాదాపు 80 సంవత్సరాల నుండి వీర్లస్వామి పూజలందుకుంటున్నారు. గతంలోని గుర్తుతెలియని వ్యక్తులు వేప మెద్దును కాల్చవేయడం జరిగింది. అప్పుడు వీర్లస్వామి వీరాపురం లోని భక్తులకు పూనకం రూపంలో(పై నీండి) శిలావిగ్రహం చేయించి ప్రతిష్టించాలని చెప్పడం జరిగిందని చెప్పుకొచ్చారు. ఆ రోజుల్లో లో నందికొట్కూర్ లో ఉన్న కమ్మయ్య శిలా విగ్రహాన్ని చేయించి పాత వీరాపురం గ్రామం లో ప్రతిష్టించిన అనంతరం భారీ ఎత్తున వీర్లాస్వామి దేవుడు పూజలందుకునే వారని శ్రీశైలం బ్యాక్ వాటర్ లో మా ఊరు మునిగే దాక ఆ దేవుని దయవల్ల మాకు ఎలాంటి ఢోకాలేదని. కలరా. గత్తెర. మసూచి.ఎన్ని మాయ రోగాలు వచ్చినా పీర్ల స్వామి దేవుడు కాపాడడం జరిగిందన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ లో ఊరు మునిగిపోయిన అనంతరం కొత్త వీరాపురం లో పాత వీర స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగిందని పూజలందుకుంటున్న వీర్లస్వామి దేవుని విగ్రహం కాలక్రమేణా పగుళ్లు రావడం జరిగింది. శాస్త్రం ప్రకారం వీరాపురం గ్రామ సభ్యులు. కమిటీ సభ్యులు అందరూ కలిసి కొత్తగా గా వీర్లస్వామి అక్క గంగమ్మ విగ్రహాలను ఆదివారం పురోహితుల సమక్షంలో ప్రతిష్టించడం జరిగింది. కుల మతాలకతీతంగా వీర్లస్వామి దేవుడు గంగమ్మ తల్లి పూజలు అందుకున్నారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వీరాపురం గ్రామ కమిటీ సభ్యులు. వీరాపురం గ్రామస్తులు కులమతాలకు అతీతంగా గా ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందని పాత వీరాపురం గ్రామ పెద్దలు పండుగ అయ్యాపు రెడ్డి చెప్పడం జరిగింది.

# సమగ్ర ఆరోగ్య విధానాలను అమలు చేయాలి

**పైసా ఖర్చు లేకుండా ప్రజలందరికీ వైద్యం అందించడం ప్రభుత్వాల బాధ్యత**

**ప్రాథమిక దశలో ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.**

**ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భవ వంటి పథకాలను ద్వితీయ,తృతీయ స్థాయి దశల్లో అమలు చేయాలి.**

**లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకుడులు డా.జయప్రకాష్ నారాయణ్ డిమాండ్**

హైదరాబాద్ ఫిబ్రవరి 14 పైసా ఖర్చు లేకుండా ప్రజలందరికీ వైద్యం అందించడం ప్రభుత్వాల భాద్యత అని, అందుకు సమగ్ర ఆరోగ్య విధానాలను అమలు చేయాలిని లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా.జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ డిమాండ్ చేసారు. "అందరికి వైద్యం..హక్కుగా వైద్య సేవలు" అనే అంశం పై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సదస్సుజరిగింది. ఈ సదస్సుకు డాక్టర్. జయ ప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా అంశాల పట్ల మరింత లోతుగా అవగాహన పెంపొందించుకోవాలని ప్రజా ప్రతినిధిలు ,అధికారులు, వైధ్యులు, మరియు అన్ని రంగాల వారిని దీనిలో భాగస్వాములను చేసి చర్చ మరింత లోతుగా జరిపి దీనిని అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లో పంతోమ్మిది వందల కోట్లు అదనంగా రాష్ట్ర బడ్జెట్ లో కేటాయిస్తే సరిపోతుందని జేపీ అన్నారు.ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు బాగానే వున్నా, అవి ప్రజలకు ఎంత మాత్రం సరిపోవు అని మరింత మెరుగు పరచాలని ఆయన అన్నారు. ప్రస్తుతం అందుతున్న వైద్య సదుపాయాలన్నీ విడివిడిగా ఉన్నాయని వాటాన్నింటిని అనుసంధాన పరిచి సమగ్ర ఆరోగ్య విధానాన్ని అందించే ఏర్పాటు చేయాలనీ సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రయోజనాలను ద్వితీయ స్థాయి లో విస్తృతం చేసి ప్రాధమిక దశలో ఫ్యామిలీ ఫిజిషియన్ వ్యవస్థను ప్రభుత్వ మరియు ప్రైవేట్ భాగస్వామ్యం తో అమలు చేయడం వలన ప్రాథమిక దశలోనే అనేక వ్యాధులు తొలిదశలోనే వాటిని అరికట్టవచ్చుఅని ఆయన అన్నారు.స్వతంత్రానంతరం నుండి ఇప్పటి కాలం వరకు ప్రజారోగ్యం పట్ల పాలకులు పెద్దగా శ్రద్ధ చూపలేదని ఇప్పటికైనా సమయం మించిపోలేదని ఆరోగ్య వ్యవస్థ పట్ల ద్రుష్టి సారించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.మన దేశం లో ఔషద రంగం చాలా బలంగా ఉందని దానిని ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకుని కొంతమేర నిధులని కేటాయిస్తే ఆరోగ్య రంగం ప్రజలకి అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు. మన దేశం లో అనారోగ్య కారణాల వలన ప్రతీ సంవత్సరం ఆరు కోట్ల మంది రాష్ట్రంలో 19 లక్షల మంది పేదరికం లోకి జారిపోతున్నారు అని అలాంటప్పుడు ప్రభుత్వాలు ఎన్ని పథకాలు పెడితే మాత్రం ఏం లాభం అని ప్రశ్నియించారు ప్రజలకి జేబులోనుండి పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు అందించడం ప్రభుత్వల భాద్యత అని ప్రజలు కూడా ఈ విషయాల పట్ల లోతుగా ఆలోచించాలని ఆయన కోరారు.అంతకు ముందు లోక్ సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఉచిత వైద్య సేవలు హక్కుగా అందే దాకా ఉద్యమాన్ని కొనసాగిస్తామని, రానున్న రోజుల్లో వివిధ రూపాల్లో ఉద్యమాన్ని చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన అన్నారు. ఈ సదస్సులో అతిధిలుగా డాక్టర్. ఆకుల నరేష్ బాబు(జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎఓం),డాక్టర్ చింతల రాజేందర్ శాశ్వత సభ్యులు, వరల్డ్ అసోసియేషన్ అఫ్ మెడికల్ లా,డాక్టర్ కేటీఆర్ సత్య ప్రకాష్ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్,కటారి శ్రీనివాస్ కన్వీనర్, కో ఆర్డినేషన్ కమిటీ,గన్ రెడ్డి రాజా రెడ్డి కొకన్వీనర్, కో ఆర్డినేషన్ కమిటీ. మరియు నాగుల స్రీనివాస యాదవ్, బి.విటోభ తదితరులు ప్రసంగించగా రాష్ట్ర నలు మూలాల నుండి విచ్చేసిన ప్రతినిధులు నందిపేట రవిందర్, రామచంద్రుడు, సారా రాజేష్, రవీందర్ రెడ్డి, రోహిత్, ఇస్మాయిల్, బాపురెడ్డి, రాజేంద్రప్రసాద్, కిషోర్, శివరామకృష్ణన్, మురళీధర్, లోక్ సత్తా పార్టీ రాష్ట్ర కార్య దర్శి సరోజా దేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# వైసీపీ ఎంపీలు రాజీనామాకు రెడీనా



శ్రీకాకుళం, ఫిబ్రవరి 14ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా విషయం ఇప్పుడు మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది.. విభజన సమస్యల పరిష్కారం కోసం జరిగే సమావేశం అజెండాలో మొదట స్పెషల్ స్టేటస్‌ను చేర్చిన కేంద్ర హోంశాఖ.. ఆ తర్వాత మళ్లీ తొలగించడంపై ఏపీ గుర్రుగా ఉంది.. ఈ వ్యవహారంలో బీజేపీతో పాటు ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీని టార్గెట్ చేస్తోంది తెలుగు దేశం పార్టీ.. ఈ వ్యవహారంపై శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడిన టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు.. రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ హామీతో వైసీపీ అధికారంలోకి వచ్చింది.. ఇప్పుడు చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీకి చెందిన చెందిన 28 మంది ఎంపీలు రాజీనామా చేసి ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.. ఆ మరుసటి క్షణమే మేం కూడా పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించారు రామ్మోహన్‌నాయుడు..సబ్ కమిటీలో స్పెషల్ స్టేటస్ అంశాన్ని అజెండాలో పెడితే దప్పు కొట్టి చెప్పారు? ఐదు అంశాలను తొలగిస్తే కేంద్రాన్ని ప్రశ్నించరా..? అని వైసీపీని నిలదీశారు రామ్మోహన్ నాయుడు.. సీఎం వైఎస్ జగన్ వైఫల్యం, చేతగాని తనమే ప్రత్యేక హోదా అంశాన్ని అజెండా నుంచి వెనుక్కు తీసుకున్నారని విమర్శించిన ఆయన? తమిళనాడు సీఎం స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ సీఎం కేసీఆర్.. కేంద్రానికి భయపడటంలేదు? కానీ, ఏపీ సీఎం జగన్ కేంద్రాన్ని గొంతెత్తి ఎందుకు అడగటం లేదు అని నిలదీశారు.. 151 మంది మినహా వైఎస్ జగన్‌ను ఎవరూ పొగిడే పరిస్థితి లేదన్న ఆయన.. సినిమా వాళ్లను పిలిపించుకొని పొగిడించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.. తుగ్లక్ లానే కాకుండా పులకేసిలా జగన్ పొగిడించుకుంటున్నారని సెటైర్లు వేశారు.. ఇక, రామానాయుడు స్టూడియోనే ఇబ్బంది పెట్టారని ఆరోపించారు టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు.

టీడీపీ కుట్ర అంటున్ వైసీపీ

అజెండా నుంచి ప్రత్యేక హోదా అంశం తొలగింపు టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రేనని ఆరోపించారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో పర్యటించిన ఆయన.. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ నేతృత్వంలో జరిగే సమావేశం అజెండా నుంచి ప్రత్యేక హోదా తొలగింపు చంద్రబాబు కుట్రే అన్నారు.. బీజేపీలోని టీడీపీ నేతల ద్వారా ఈ పని చేయించారని విమర్శించారు.. ఇక, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు పెద్దిరెడ్డి? ప్రత్యేక హోదా కోసం మా పోరాటం కొనసాగుతుందని ప్రకటించిన ఆయన.. చంద్రబాబుకు హోదా పై మాట్లాడే అర్హతే లేదన్నారు.. ప్యాకేజీ కోసం టీడీపీ అమ్ముడుపోయింది అంటూ మండిపడ్డారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.

# డెడ్ స్టోరేజీకి శ్రీ శైలం...విద్యుత్ ఆపండి

కర్నూలు, ఫిబ్రవరి 14 రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలు కొనసాగుతూనే వున్నాయి. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని ఆదేశించింది కేఆర్ఎంబీ. రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవద్దని రెండు రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాసింది. ఇప్పటికే రాసిన లేఖలపై ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో రెండు రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది బోర్డు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని రెండు తెలుగు రాష్ట్రాలకు ఆదేశించింది కేఆర్ఎంబి. ఈ సంవత్సరం మే నెల వరకు తెలంగాణకు మూడు టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు ఆరు టీఎంసీలు తాగునీటికి కోసం అవసరం ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌లో 34.24టీఎంసీలు మేర మాత్రమే నీరు ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

నిండుకుండలా ఉండాల్సిన శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండుకుంటోంది. 215 టీఎంసీల సామర్థ్యానికి.. 35 టీఎంసీల డెడ్‌స్టోరేజీ స్థాయికి నీటి నిల్వలు అడుగంటిపోయాయి. రెండు రాష్ట్రాలు పోటాపోటీగా విద్యుత్ ఉత్పత్తిచేయడంతో ఈ దుస్థితి వచ్చిందటున్నారు ఇరిగేషన్ నిపుణులు. ఇరు రాష్ట్రాల్లో ఉత్పత్తి అవుతున్న జలవిద్యుత్తులో శ్రీశైలం వాటానే చెరో 40శాతంగా ఉండటంతో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయ్. అయితే పరిస్థితులను ముందే ఊహించి, ఐదు నెలల క్రితమే ఇరు రాష్ట్రాలను హెచ్చరిస్తూ బోర్డు లేఖలు రాసింది. తాగు, సాగు నీటి అవసరాల కంటే ఎక్కువగా నీరు ఉంటేనే జలవిద్యుత్తు ఉత్పత్తి జరగాలి. కానీ విద్యుదుత్పత్తి కోసమే నీటిని వినియోగించి.. సముద్రంలోకి వృథాగా వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఇరు రాష్ట్రాల అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత ఏడాది ఇదే సమయానికి 129.78 టీఎంసీల నీరు ఉంది. కాని ఇప్పుడు నీటి నిల్వలు ఏకంగా 35.51 టీఎంసీలకు పడిపోయింది. కేఆర్ఎంబీ లేఖ రాసిన తర్వాత ఇరు రాష్ట్రాలు జలవిద్యుదుత్పత్తి కోసం 59 టీఎంసీలను వినియోగించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది వెయ్యికిపైగా టీఎంసీల మేర ఇన్‌ఫ్లో వచ్చినా.. ప్రస్తుత నిల్వలు డెడ్ స్టోరేజీ స్థాయిలో ఉన్నాయి. ఇప్పటికైనా రెండు రాష్ట్రాలు మేల్కోకపోతే సమ్మర్‌లో తాగునీటి సమస్యలు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయ్.

# అంగరంగ వైభవంగా16 నుంచి కల్యాణోత్సవాలు

**శ్రీ తిరుపతమ్మవారి ఆలయం**

పెనుగంచిప్రోలు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల పాలిట కొంగు బంగారమైన పెనుగంచి ప్రోలు తిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాలు ( పెద్ద తిరునాళ్ల ) ఫిబ్రవరి 16 నుంచి 20 వ తేదీ వరకు జరగనున్నాయి . గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణంతో పాటు 41 రోజుల శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు పాటు మండల దీక్ష చేపట్టిన వేలాది మంది స్వాములు తిరుముడి సమర్పించి దీక్ష విరమించేం దుకు తగిన ఏర్పాటు ఆలయ అధికారులు చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అమ్మవారి కల్యాణానికి తరలివచ్చే అవకాశం ఉంది .. తిరుపతమ్మ ఆలయ స్థల పురాణం .. 17 వ శతాబ్దంలో పవిత్ర మునేటి తీరాన కొల్లా శివ రామయ్య , రంగమాంబ దంపతులకు ఏడుకొండలవాడి వర ప్రసాదంగా తిరుపతమ్మ జన్మిస్తుంది . పెనుగంచిప్రోలులోని కాకాని కృష్ణయ్య , వెంగమాంబ దంపతుల కుమారుడు గోపయ్యను వివాహం చేసుకున్న తిరుపతమ్మ రాకతో ఆ ప్రాంతమంతా సుభిక్షంగా వర్ధిల్లుతుంటుంది .అయితే అనుకోకుండా ఒకనాడు ఎండలు పెరిగి .. పాడిపంటలు కరువై .. కరువు విలయ తాండవం చేస్తుంది . దీంతో పశు:గాసం కోసం గోపయ్య గోవులను తోలుకొని అడవికి వెళ్తాడు . ఈసమయంలో అత్త , తోటికోడలు ఆరళ్లకు తోడు భయంకరమైన కుష్ఠు వ్యాధితో బాధ పడుతున్న తిరుపతమ్మను పశువుల పాకకు గెంటి వేస్తారు పశువుల శాలలో దీన స్థితిలో ఉన్న ఆమెకు పాపమాంబ అనే ముదిరాజ్ కులానికి చెందిన సేవకురాలు సేవలందిస్తుంది . అడవికి వెళ్లిన గోపయ్య పులి దాడిలో మరణించాడని తెలుసుకున్న తిరుపతమ్మ తన అవతార సమాప్తిని గ్రహించి గ్రామాధి కారులు , ప్రజలకు తన మహిమలను తెలుపుతుం ది . భర్తతో పాటు సహగమనం చేస్తుంది. ఆతరువాత కాలంలో అదే ప్రాంతంలో గోపయ్య సమేత తిరుపతమ్మ విగ్రహాలతో పాటు , కుంకుమ భరిణ దొరికాయని , ఆప్రాంతంలోనే ఆలయం నిర్మించారని భక్తులు చెబుతారు. ప్రతిఏటా మాఘశుద్ధ పౌర్ణమి , పాల్గుణ పౌర్ణమికి రెండు సార్లు ఐదు రోజులపాటు తిరునాళ్ల నిర్వహిస్తారు . కుష్ఠు రోగిగా ఉన్న తిరుపతమ్మకు సేవలు చేసిన పాపమాంబ , వంశీయులే నేటికీ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు .నిత్యం వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని సేవించి తరిస్తున్నారు . క్షేత్రం చేరుకోవటానికి మార్గాలు ... పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం చేరుకోవటానికి విజ యవాడ నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి . పెనుగంచిప్రోలు నుంచి విజయవాడకు 60 కిలో మీటర్ల దూరం ఉంది . అలాగే పెనుగం చిప్రోలుకు 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న జగ్గ య్యపేట నందిగామ నుంచి కూడా ఆర్టీసీ బస్సులు , ఆటోలు ఉన్నాయి . ఖమ్మం , మధిర నుం చి బస్సులు అందుబాటులో ఉన్నాయి .

# తిరుమలలో డబ్బులే ముఖ్యమా...

తిరుపతి, ఫిబ్రవరి 14,(న్యూస్ పల్స్)తిరుమల తిరుపతి దేవస్థానంపై హనుమత్ జన్మతీర్థ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గోవిందానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు చేశారు. టీటీడీ పాలకమండలి దైవద్రోహం చేస్తోందని గోవిందానంద సరస్వతీ ఆరోపించారు. తిరుమలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ? హనుమంతుడి జన్మస్థలం పేరిట టీటీడీ నకిలీ పుస్తకం ముద్రించి, తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. సన్యాసులను, చరిత్రకారులను, ప్రజలను టీటీడీ మోసం చేస్తోందని, అంజనాద్రి పేరుతో తిరుమలలో దుకాణాలు ఏర్పాటు చేయడానికి, టీటీడీ ప్రయత్నాలు జరుపుతున్నారని విమర్శించారు.డబ్బులు సంపాదించడమే లక్ష్యంగా టీటీడీ పాలక మండలి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపణలు గుప్పించారు. మరోవైపు, రూ.1200 కోట్లతో కిష్కింద అభివృద్ధికి కర్ణాటక సీఎం ఇప్పటికే ప్రకటన చేశారని, కిష్కిందలోని పంపా తీరంలోనే హనుమంతుడు పుట్టాడని అందరూ అంగీకరించారని గోవిందానంద సరస్వతీ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా అక్కడకు వెళ్లి ఈ విషయాన్ని ఒప్పుకున్నారని తెలిపారు. టీటీడీకి చెందిన పాలకమండలి మాత్రం హనుమంతుడి జన్మస్థలం విషయంలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తప్పుడు ప్రచారం చేస్తూ దైవ ద్రోహం చేస్తున్నారని, సనాతన ధర్మానికి ఇబ్బంది కలిగించే వారిని వదిలిపెట్టబోమని గోవిందానంద సరస్వతీ హెచ్చరించారు.

# ఫేక్ కలెక్టర్ అరెస్ట్

గుంటూరు, ఫిబ్రవరి 14 (న్యూస్ పల్స్)నకిలీ ఐఏఎస్? అవతారమెత్తి నమ్మిన వారిని నిండాముంచాడు. కలెక్టర్?గా చలామణి అవుతూ ఉద్యోగాల పేరుతో వసూళ్లకు తెరలేపాడు. అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా, తీగ లాగితే సదరు ఆఫీసరుగారి డొంకంతా కదిలింది. గుంటూరు జిల్లాలో వెలుగు చూసింది ఈ నకిలీ ఐఏఎస్‌ఆఫీసర్ బాగోతం. గుంటూరుకు చెందిన శ్రీనివాసరావు కొంత కాలం హైదరాబాద్ లో ఉద్యోగం చేశాడు. ఆ తర్వాత గుంటూరు తిరిగి వచ్చి ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. ఎక్కడా ఉద్యోగం రాలేదు. దీంతో ఓ కన్నింగ్ ప్లాన్ వేశాడు. నగరంలోని బాలాజీ హాస్పిటల్ ఎండి చంద్రశేఖర్ కి ఫోన్ చేశాడు. తనని తాను ఐఏఎస్ కృష్ణ బాబుగా పరిచయం చేసుకున్నాడు. తాను చెప్పిన వ్యక్తికి ఉద్యోగం ఇవ్వాలని బెదిరించాడు. ఉద్యోగం తో పాటు జీతం కూడా ఎంతో తానే చెప్పాడు. నెలకి నలభై వేల రూపాయలు ఇవ్వాలన్నాడు. అంతేకాదు. ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేసి మేనేజర్ హోదా ఇవ్వాలన్నాడు. తాను చెప్పినట్లు చేయకపోతే ఆసుపత్రి నే సీజ్ చేస్తానని హెచ్చరించాడు.సరే అన్న డాక్టర్ ఈ విషయాన్ని పోలీసులకు చెప్పాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆసుపత్రి మేనేజర్ చేత శ్రీనివాసరావుకి ఫోన్ చేయించారు. మీరు చెప్పినట్లు ఉద్యోగం ఏర్పాటు చేశామని ఆ ఉద్యోగిని పంపాలని చెప్పారు. కొద్ది సేపటి తర్వాత ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి ని పోలీసులు పట్టుకున్నారు. అరెస్ట్ చేసి తమదైన శైలిలో విచారించారు. పోలీసుల విచారణలో ఆశ్చర్యకర విషయాలు వెలుగు చూశాయి. ఉద్యోగం కావాలని వచ్చిన వ్యక్తే శ్రీనివాస్ అని ఉద్యోగం కావాలని ఐఏఎస్ అధికారి పేరుతో ఫోన్ చేసింది కూడా తానేనని ఒప్పుకున్నాడు. అయితే, కేవలం బాలాజీ ఆసుపత్రి కే కాకుండా,?ఇంకా మరో రెండు మూడు ఆసుపత్రులకు ఇదేవిధంగా ఫోన్ చేసి ఉద్యోగం కావాలని బెదిరించినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నాడు ఫేక్ కలెక్టర్ శ్రీనివాసరావు.

## అబ్బి పురం గ్రామంలో సెల్ టవర్ నిర్మాణము వెంటనే ఆపాలి

### సిపిఐ డిమాండ్



నంద్యాల ఫిబ్రవరి 14( విభారె) , :-మహానంది మండలం అబ్బి పురం గ్రామ పరిధిలో ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణం వెంటనే ఆపాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేసింది . మహానంది మండలం సమితి ఆధ్వర్యంలో మహానంది ఎంపీడీవో సుబ్బారాజ్ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు . ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు.ఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ మండల కార్యదర్శి ఆర్. సామేలు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న. అబి పురం గ్రామశాఖ సిపిఐ నాయకులు. సురేష్. బాలన్న. హుసేని. పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. మహానంది మండలం అభిపురం గ్రామ పరిధిలోని కస్తూరిబా పాఠశాల వద్ద ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయనిఅన్నారు. ఎయిర్టెల్ సెల్ టవర్ నుండి వచ్చే వైబ్రేషన్ వల్ల గర్భిణీ స్త్రీలకు చిన్న పిల్లలకు హార్ట్ పేషెంట్లకు చాలా ఇబ్బందులకు గురవుతారని ఆరోపించారు. అభి పురం గ్రామం లోని కస్తూరిబా పాఠశాల వద్ద నిర్మిస్తున్న సెల్ టవర్ వల్ల అక్కడే హాస్టల్ ఉన్న చదువుతున్న బాలబాలికలకు చుట్టుపక్కల ఉన్న గ్రామ ప్రజలకు మానసికంగా శారీరకంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతారని అధికారులు చొరవ చూపి ఆ సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలని లేనిపక్షంలో సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపట్టేందుకు సన్నద్ధమవు తామని నాయకులు హెచ్చరించారు.

## డెమో ట్రైన్ నిలపాలని గ్రామస్తులు రైల్వే రోకో

తుగ్గలి ఫిబ్రవరి 14( విభారె) , తుగ్గలి మండల పరిధిలోని రామలింగాయపల్లె రైల్వే స్టేషన్ నందు డెమో ట్రైను నిలపాలని గ్రామస్తులు రైల్వే రోకో నిర్వహించారు.సోమవారం డోన్ నుండి పెండేకల్ ఆర్ఎస్ మీదుగా వయా గుత్తి మీదుగా వెళ్లే డెమోట్రైన్ ను రామలింగాయపల్లె స్టేషన్లు నిలపాలని సుమారు 150 మంది గ్రామ ప్రజలు పాల్గొని రైల్వేస్టేషన్ నందు రైల్వే రోకో ను నిర్వహించారు.ఈ విషయం పై గతంలో జనవరి 5న రైల్వే డివిజనల్ మేనేజర్ (డిఆర్ఎం) గుంతకల్ వారికి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని,అదేవిధంగా రామలింగయపల్లె పరిసర ప్రాంత ప్రజల అభ్యర్థన మేరకు కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్ కుమార్ దక్షిణ మధ్య రైల్వే జోన్ ఏజీఎం సికింద్రాబాద్ క్యాంపు కార్యాలయం నందు వ్యక్తిగతంగా కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని,అయినా రైల్వే అధికారులు గ్రామ ప్రజల అభ్యర్థన పై నిర్లక్ష్యం వహించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నేడు రామలింగాయపల్లె రైల్వే స్టేషన్ నందు రైలు రోకో నిర్వహించారు.ఈ రైల్ రోకో కార్యక్రమం గ్రామ ప్రజలు ఐక్యమత్యంతో కలిసి నిర్వహించారు.ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు డెమో ట్రైన్ నిలపాలని ప్రజలు రైల్వే అధికారులకు విన్నవించుకున్నారు.

## ప్రత్యేక హోదా కోసం ఎంపీలు రాజీనామా చేయాలి



మంత్రాలయం ఫిబ్రవరి 14( విభారె) : తనపై ఉన్న కేసుల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన ఘనత ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేనని మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ తిక్కా రెడ్డి ఎద్దేవా చేశారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తిసుకోస్తాం అని చెప్పి వైయస్సార్ యం పి లు పార్లమెంటు లో ఏమి చేస్తున్నారు అని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి ప్రశ్నించారు.పాదయాత్రలో జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హ?మిలు ఏమి అయినాయి అని ప్రత్యేక హోదా కచ్చితంగా తిసుకోస్తాం అని వైయస్సార్ ఎమ్మెల్యే లు మాట్లాడిన మాటలు ఎక్కడా అమలయ్యాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జగన్ మోహన్ రెడ్డి కేసులు కోసం రాష్ట్రని తాకట్టు పెట్టి ప్రజలను మోసము చేసిన ఘనత

### ప్రత్యేక హోదా కోసం యం.పి. లు. రాజీనామా ఎక్కడా?

### మంత్రాలయం టిడిపి ఇన్చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి

వైయస్సార్ ప్రభుత్వది అని ఎప్పుడు ప్రతిపక్ష నేతలను తిట్టడం తప్ప రాష్ట్రానికి ,ప్రజలకు చేసింది ఏమి లేదు అని విమర్శించారు.మా తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారు అధికారం లో వున్నపుడు ప్రత్యేక హోదా కోసం కేంద్రంలో నుండి బయటికి వచ్చిన ఘనత మా పార్టీది. మీ కేసుల కోసం కేంద్రంతో లాలూచీపడి ప్రత్యేక హోదా ను తాకట్టు పెట్టిన ఘనత జగన్ రెడ్డిది అని ఘాటుగా విమర్శించారు. మీరు ప్రత్యేక హోదా కోసం యం పి లు రాజీనామా చేస్తామని చెప్పి మూడు సంవత్సరాలు అయినా ఎందుకు చేయడం లేదని నిలదీశారు. ప్రత్యేక హోదా కోసం ఎక్కువ పోరాటం చేసింది ఎవరో ప్రజలో తేల్చుకుందాం రండి అని వైయస్సార్ నాయకులకు సవాలు విసిరారు. పేరుకే వైయస్సార్ ప్రభుత్వం అని 151 సీట్లు గెలిచాము అని చెపుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదు అని రాష్ట్రంలో రైతులు పరిస్థితి చాలా దారుణంగా వుంది అని రైతులను అందుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలనకు నిదర్శనం అని రాష్ట్రంలో ప్రజలు పెరిగిన ధరలు తో చాలా ఇబ్బందులు పడుతున్న జగన్ మోహన్ రెడ్డికి చీమ కుట్టినట్టు కూడా లేదు అని రాష్ట్రంలో చీకటి పాలన కొనసాగిందని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రదాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, కోసిగి మండలం కన్వీనర్ జ్ఞానేష్, రైతు సంఘం కార్యదర్శి నాడిగేని అయ్యన్న, సాతనూరు కోసిగయ్య, చిన్న భూంపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు, జంపాపురం మాజీ సర్పంచ్ క్రిష్ణ రెడ్డి, జిల్లా మహిళ కార్యదర్శి నాడిగేని నర్సమ్మ ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు, బెళగల్ సర్పంచ్ రామయ్య, ఈరయ్య, జాలవాడి ముని, తెలుగు యువత నాడిగేని మహదేవ్ , వెంకటేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య శతజయంతి ఉత్సవాలు



కర్నూలు జిల్లాకు దామోదర సంజీవయ్య పేరు పెట్టాలి డిమాండ్ చేసిన ప్రజా సంఘాల నాయకులు

ఏమ్మిగనురుఫిబ్రవరి 14( విభారె) "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య శతజయంతి ఉత్సవాలు ఎమ్మిగనూరు పట్టణం స్థానిక సోమప్ప సర్కిల్ నంద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాల మహానాడు కార్యదర్శి కుందా వెంకటేశ్వర్లు , ఆల్ ఇండియా క్రిస్టియన్ అధ్యక్షులు మల్లెలల్ప్రెడ్ రాజు , బీసీ సంఘం నాయకులు బతకన్న, గణేష్ ,లు పాల్గొని దామోదరం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు ఎం నరసప్ప, ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు మందుబాబులు, మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రి గా ఆల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షులుగా సేవలందించిన ఘనుడు నీతికి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం దామోదర సంజీవయ్య అని కొనియాడారు ,అలాగే ఈయన ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న కాలంలో దాదాపు ఆరు లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టడం భారతదేశ చరిత్రలో ఏ నాయకుడు చేయని కీర్తి వీరికే సాధ్యమని రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ వ్యవసాయ అభివృద్ధి కోసమే పలురకాల చెరువులను ప్రాజెక్టులను ఏర్పాటు చేశారని ఇంతటి చరిత్ర కలిగిన స్వర్గీయ దామోదర సంజీవయ్య గారు కర్నూలు జిల్లా పెదపాడు గ్రామంలో మునేయ్య లక్ష్మమ్మ దంపతులకు 1927 వ సంవత్సరంలో జన్మించి పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా సేవలందించారని తెలిపారు

## అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ పై పోలీసులకు పిర్యాదు

### హిమంత బిశ్వ శర్మ క్షమాపణ చెప్పాలి

### ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్



ఎమ్మిగనూరు ఫిబ్రవరి 14( విభారె) .కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వ శర్మ పై ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్ లో పట్టణ ఎస్ఐ తిరుపాల్ కు ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు వీరేస్ యాదవ్ అధ్వర్యంలో సోమవారం పిర్యాదు చేశారు. నువ్వు రాజీవ్ గాంధీ కొడుకేనా అని మేము ఎప్పుడు రుజువు అడగలేదు" అనే వ్యక్తిగత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. దేశ సంస్కృతిపై గౌవరం ఉంటే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దేశ సంస్కృతికి విరుద్దంగా బిజెపి ముఖ్యమంత్రి శర్మ చేసిన వ్యాఖ్యాలకు దేశ ప్రధాని మోడీ, బిజెపి అగ్రనాయకత్వం వెంటనే జాతికి క్షమాపణలు చెప్పాలన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కుమారుడు పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ పై ఇలాంటి వ్యాక్యాలు చేసిన అస్సాం ముఖ్యమంత్రి శర్మ ఇదేనా నీ సంస్కృతి, సంస్కారమా. బీజేపీకి అధిష్టానం మెప్పు కోసం రాహుల్ గాంధీ పై అస్సాం సీఎం చేసిన వ్యాక్యాలకు భవిష్యత్తులో కమలం పార్టీ భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లో నాయకులు శేఖర్, అనంత కుమార్, పాల్గొన్నారు.


## పరిపాలన లో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి విఫలం

కౌతాళం ఫిబ్రవరి 14( విభారె) :రాష్ట్రానికి ప్రత్యేక హోదా తిసుకోస్తాం అని చెప్పి వైయస్సార్ యం పి లు పార్లమెంటు లో ఏమి చేస్తున్నారు అని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి గారు అన్నారు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాదయాత్రలో జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హ?మిలు ఏమి అయినాయి అని ప్రత్యేక హోదా కచ్చితంగా తిసుకోస్తాం అని వైయస్సార్ ఎమ్మెల్యే లు మాట్లాడిన మాటలు ఎక్కడా అమలు చేశారని కేంద్రానికి జగన్ మోహన్ రెడ్డి కేసులు కోసం రాష్ట్ర ని తాకట్టు పెట్టి ప్రజలను మోసము చేసిన ఘనత వైయస్సార్ ప్రభుత్వది అని ఎప్పుడు ప్రతిపక్ష నేతలను తిట్టడం తప్ప చేసింది ఏమి లేదు అని మా తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధికారం లో వున్నపుడు ప్రత్యేక హోదా కోసం కేంద్రం తో నుండి బయటికి వచ్చిన ఘనత వుంది మీరు ప్రత్యేక హోదా కోసం యం పి లు రాజీనామా చేస్తామని చెప్పి మూడు సంవత్సరాలు అయినా ఎందుకు నిర్లక్ష్యము చేస్తున్నారు అని వారు

### ప్రత్యేక హోదా కోసం యం పి లు రాజీనామా ఎక్కడా పాలకుర్తి తిక్కరెడ్డి


అన్నారు ప్రత్యేక హోదా కోసం ఎక్కువ పోరాటం చేసింది ఎవరో ప్రజలో తేలుచ్చుకుందాం రండి అని వైయస్సార్ నాయకులకు సవాలు విసిరారు పేరుకే వైయస్సార్ ప్రభుత్వం అని 151 సీట్లు గెలిచాము అని చెపుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదు అని రాష్ట్రంలో రైతులు పరిస్థితి చాలా దారుణంగా వుంది అని రైతులను అందుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలనకు నిదర్శనం అని రాష్ట్రంలో ప్రజలు పెరిగిన ధరలు తో చాలా ఇబ్బందులు పడుతున్న జగన్ మోహన్ రెడ్డి కి చీమ కుట్టినట్టు కూడా లేదు అని రాష్ట్రంలో చీకటి పాలన కొనసాగింది

## మీమ్స్ పై సీతమ్మ రాక్.. ఒక్కొక్కరికి ప్యాక్!



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ 'ఆర్ ఆర్ ఆర్' సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో అలియా భట్ రామ్ చరణ్ కి జోడీగా సీత పాత్రలో నటిస్తుంది. ఆరంభంలోనూ బ్యూటీ అరుదైన పాత్రని అందిపుచ్చుకుంది. అదీ తెలుగు ప్రేక్షకులకు వేగంగా కనెక్ట్ అయ్యే రోల్ కావడం అలియా కెరీర్ కి కలిసొచ్చే అంశం. అందుకే ఈ బ్యూటీ ని యంగ్ టైగర్ ఎన్టీఆర్ సైతం ముందుగానే లాక్ చేసారు.ఆయన కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలో అలియానే హీరోయిన్ గా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ రెండు చిత్రాల్ని బట్టే అలియా తెలుగులో గనుక కొనసాగితే ఇక్కడా స్టార్ హీరోయిన్ గా అవతరించడానికి ఎంతో సమయం పట్టదు.తాజాగా ఈ బ్యూటీ మీమ్స్ పై తనదైన శైలిలో కౌంటర్ వేసింది. 'నాపై చేసిన మీమ్స్ తో నాకెలాంటి సమస్యలు లేవు. అవి నాకు చాలా ఫన్నీగా అనిపిస్తాయి. మీమ్ లు చేసిన వారి పాపులారిటీని పెంచుతాయని" తనదైన శైలిలో క్లాస్ గా కౌంటర్ ఇచ్చింది. ఇదే విషయాన్ని గతంలో మీమ్స్ చేసిన వారికి చెప్పాను. మళ్లీ చెబుతున్నా..నన్ను పాపులర్ చేయాలనుకుంటే నాకు బధులుగా మీరు అవుతారని అలియా పంచ్ వేసింది.ఇక బాలీవుడ్ అలియాలో ఎంత బిజీగా ఉందో తెలిసిందే. ప్రస్తుతం ఆమె నటిస్తోన్న 'గంగూబాయి కతియావాడి' పై భారీ అంచనాలున్నాయి. ఇటీవలే రిలీజ్ అయిన ట్రైలర్ సినిమాపై అంచనాల్ని అంతకంతకు పెంచేసింది.అలియా నట విశ్వరూపం గంగూబాయి పాత్రలో ఆవిష్కరించినట్లే కనిపిస్తోంది. ఆ పాత్ర ఆహార్యంలో అలియా ఒదిగిపోయింది. సినిమా సక్సెస్ అయితే గనుక అలియాభట్ కి ప్రత్యేకమైన ఇమేజ్ ని ..గుర్తింపుని తీసుకొస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఫిబ్రవరి 25న చిత్రాన్ని నేరుగా థియేటర్లలోనే రిలీజ్ చేస్తున్నారు. దీంతో యూనిట్ ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమైంది.అలియా భట్ బాలీవుడ్ మీడియాకి ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తూ బిజీగా ఉంది. బాలీవుడ్ టెలివిజన్ షోస్ కి హాజరవుతూ గంగూబాయి కి వీలైనంత ప్రచారం కల్పిస్తోంది. ఈ ఏడాది అలియా భట్ తొలి సినిమా రిలీజ్ ఇదే. మార్చి 25న 'ఆర్ ఆర్ ఆర్' రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాలు సక్సెస్ అయితే అలియా బ్రాండ్ ఇమేజ్ రెట్టింపు అవుతుంది.

## ఆ హిట్ ఫార్ములాతో ప్రభాస్ రామ్ సక్సెస్ అవుతారా?




ఎన్టీఆర్ మహేష్ బాబు పవన్ కళ్యాణ్ రామ్ చరణ్ రవితేజతో సహా ఎందరో హీరోలు పోలీస్ పాత్రను పోషించి సూపర్హా సక్సెస్ అయ్యారు. దీంతో పోలీస్ పాత్రలు బాక్సాఫీస్ దగ్గర హిట్ ఫార్ములా మారింది. అయితే ఇప్పుడీ హిట్ ఫార్ములానే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఫాలో అవ్వబోతున్నారు.వాస్తవానికి ఈ జనరేషన్ హీరోల్లో రామ్ ప్రభాస్లు ఒక్కసారి కూడా ఖాకీ డ్రస్ వేయలేదు. కానీ త్వరలోనూ వీరిద్దరూ పోలీస్ పాత్రలో అలరించబోతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. రామ్ ప్రస్తుతం తమిళ స్టార్ డైరెక్టర్ లింగుస్వామితో 'ది వారియర్' అనే సినిమా చేస్తున్నాడు.తెలుగు తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రంలో కృతీ శెట్టి అక్షర గౌడ హీరోయిన్లుగా ఆది పినిశెట్టి విలన్గా నటిస్తున్నారు. అయితే ఈ మూవీలో రామ్ ఓ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్గా కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ఈయన ఫస్ట్ లుక్ విశేషకంగా ఆకట్టుకుంటోంది.ఇక ప్రభాస్ విషయానికి వస్తే.. ప్రస్తుతం వరుస సినిమాలను లైన్లో పెట్టుకుంటూ దూసుకుపోతున్న ఈయన ఇటీవల 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే మూవీ చేయనున్నట్లు ప్రకటించాడు. టీ సిరీస్ వంగా పిక్చర్స్ బ్యానర్లపై పాన్ ఇండియా లెవల్లో ఈ మూవీని నిర్మితం కాబోతోంది.అయితే ఈ మూవీలో ప్రభాస్ సైతం పోలీస్ ఆఫిసర్గా కనిపించబోతున్నాడు. ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్ ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో లీక్ చేశారు. మొత్తానికి కెరీర్ స్టార్ట్ అయన ఇన్నేళ్లకు పోలీస్ పాత్రను ఎంచుకున్న రామ్ ప్రభాస్లు ఏ మేరకు సక్సెస్ అవుతారు అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## 'ఖిలాడి' భామ వద్దన కెరీర్ ని నిర్దేషిస్తుందా!

'ఖిలాడి' సినిమాలో విజయవాడ బ్యూటీ డింపుల్ హయతీ గ్లామర్ షోతో ఏ రేంజ్ లో ఆకట్టుకుందో చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటివరకూ ఏ తెలుగు హీరోయిన్ కూడా ఈ రేంజ్ లో వండి వడ్డించలేదు. మాస్ రాజా రవితేజకు భార్య పాత్ర నుంచి యూరప్ లోని నాగరిక అమ్మాయి వరకూ ఛాన్స్ దొరికినప్పుడల్లా డింపుల్ సత్తా చూపించే ప్రయత్నం చేసింది.డైరెక్టర్ విజన్ ని మించి ఎక్స్ ఫోజింగ్ సన్నివేశాల్లో ఎలివేషన్స్ ఇచ్చింది. సాధారణంగా స్కిన్



షో స్ కి ముంబై బ్యూటీలు పెట్టింది పేరుగా ఫేమస్ అయ్యారు. కానీ తెలుగు హీరోయిన్ డింపుల్ కూడా వాళ్లకు ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించింది.ఛాన్స్ దొరికినప్పుడల్లా తన మార్క్ వేసే ప్రయత్నం చేసింది. అయితే డింపుల్ ని సినిమాలో కేవలం ఎక్స్ ఫోజింగ్ కోసమే తీసుకున్నారా? అన్న సందేహం రాక మానదు సుమా. ఎందుకంటే సినిమా చూసిన ప్రతీ ఒక్కరికి అదే అనుభూతి కల్గుతుంది. డింపుల్ ని కేవలం స్కిన్ షోకే పరిమితం చేసారు తప్ప నటించే స్కోప్ ఎక్కడా ఇవ్వలేదు. తన పని వరకూ డైరెక్టర్ చెప్పినట్లు చేసుకుంటూ పోయింది. అయితే ఈ విషయంలో డింపుల్ పై కాస్త నెగిటివిటీ కూడా స్ప్రెడ్ అవుతుంది. ఆ పాత్ర కోసం ఏ స్టార్ హీరోయిన్ ఒప్పుకోకపోతేనే డింపుల్ వరకూ వచ్చిందనే గుస గుస వినిపిస్తోంది.నటనకు ఎంత మాత్రం స్కోప్ లేదు. పైగా తెరపై కనిపించినంత సేపు యువత టార్గెట్ గా ఆ పాత్రని డిసైజ్ చేసినట్లు కనిపించింది. రవితేజకు హీరోయిన్ల సమస్య ఎలాగూ ఉంది. పైగా లైమ్ లైట్ లో ఉన్న హీరోయిన్లు అంతా పెర్ఫార్మెన్స్ ఓరియేంటెడ్ పాత్రల వైపు మొగ్గు చూపుతున్నారు. ఆ లెక్కన చూసుకుంటే 'ఖిలాడి'లో నటించడానికి ఏ హీరోయిన్ ముందుకు రాదు. ఇక్కడ డింపుల్ ఎంపిక వెనుక ఓ లాజిక్ ఉంది. విజయవాడ అమ్మాయి. తెలుగు సినిమా. సినిమాకి గ్లామ్ షో అవసరం. ఆ ప్రాతిపదిక డింపుల్ ని ఎంపిక చేసినట్లు కనిపిస్తోంది. అలాగే మాస్ రాజాకి హీరోయిన్ల సమస్య కూడా కొద్ది కాలంగా ఉండనే ఉంది.అలా డింపుల్ 'ఖిలాడి'లో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు కనిపిస్తుంది. ఇక డింపుల్ కి ఓ క్రేజీ ప్రాజెక్ట్ రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మహేష్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో సెకెండ్ లీడ్ కి మీనా క్షి చౌదరితో పాటు.. డింపుల్ హయతి పోటీలో ఉన్నట్లు 'ఖిలాడి' రిలీజ్ కు ముందు ప్రచారంలో ఉంది. మరి 'ఖిలాడి' రిలీజ్ అయింది కాబట్టి మార్పులు ఏమైనా చోటు చేసుకుంటాయేమో చూడాలి.

## పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శిఖర్ ధావన్!




ఐపీఎల్ మెగావేలం ముగిసింది. మెగావేలంలో తమకు ఇష్టమైన ఆటగాళ్లను దక్కించుకున్న ఫ్రాంచైజీలు ఇక కెప్టెన్ల వేట మొదలుపెట్టనున్నాయి. కాగా పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శిఖర్ ధావన్‌ను ఎంపికచేయనున్నట్లు సమాచారం. కొన్ని రోజుల్లో ఈ విషయాన్ని పంజాబ్ కింగ్స్ ప్రకటించనుంది. కాగా వేలంలో ధావన్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 8.25 కోట్లకు దక్కించుకుంది. "జట్టు కెప్టెన్‌గా ధావన్ ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి. టీమిండియాలో ఒక సీనియర్ ఆటగాడిగా ఉన్న ధావన్ పంజాబ్ కెప్టెన్‌గా జట్టును తన భుజాలపై మోస్తాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీతో పాటు కోచ్ కూడా ధావన్‌వైపు మొగ్గుచూపుతున్నారు. తొందర్లోనే దీనిపై స్పష్టమైన ప్రకటన వస్తుంది." అంటూ పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీలో ఒక కీలక వ్యక్తి తెలిపారు.కాగా 12 కోట్లతో పంజాబ్ కింగ్స్ రిటైన్ చేసుకున్న మయాంక్ అగర్వాల్‌ను కెప్టెన్ చేసే అవకాశం లేకపోలేదు. అయితే సీనియారిటీ ప్రకారం ధావన్ కెప్టెన్ అయితేనే బాగుంటుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో కెప్టెన్ ఎవరనే దానిపై క్లారిటీ రానుంది. ఇక ఈసారి కచ్చితంగా కప్ సాధించాలని అనుకుంటున్న పంజాబ్ వేలంలో నిఖార్సైన ఆటగాళ్లను దక్కించుకుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190